# మానవహక్కుల వేదిక 3వ రాష్ట్ర మహాసభలు

## ప్రధాన కార్యదర్శి నివేదిక

## అనంతపురం, 3 అక్టోబర్, 2009

---

మూడవ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన సభ్యులందరికీ కార్యవర్గం తరపున వందనాలు.

గడచిన రెండు సంవత్సరాల కాలంలో మనం చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకొని రాబోయే రెండు సంవత్సరాలలో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన సూచనలు పొందడం ఇవాళ్టి మన కర్తవ్యం. అయితే ఈ మధ్యనే 10 సంవత్సరాల సమీక్ష జరుపుకున్నాము కాబట్టి కార్యక్రమాలను వివరంగా ఏకరవు పెట్టే పని పెట్టుకోకుండా భవిష్యత్ కార్యాచరణ గురించి ఎక్కువ మాట్లాడుకోవడం ఉచితంగా వుంటుంది. మనం ఫలానా పని చేపడితే బాగుంటుందని, ఫలానా దిశగా ముందుకు పోతే బాగుంటుందని, పనిచేసే క్రమంలో కార్యకర్తల నుండి, మిత్రుల నుండి సూచనలు వస్తుంటాయి లేదా మన కార్యక్రమాల పురోగమన క్రమమే అటువంటి సూచనలు ఇస్తుంటుంది. వాటిని దృష్టిలో పెట్టుకొని ఒక్కొక్క రంగంలో ఏ దిశగా మన కార్యకలాపాలను మలచుకోవడం ఉచితంగా వుంటుందో మాట్లాడుకుందాం.

ఈ చర్చ అర్థవంతంగా పెట్టుకోవాలంటే సంస్థ నిర్మాణాన్ని గురించి స్పష్టమైన అంచనా వుండటం అవసరం. కార్యకర్తలు ఎంతమంది వున్నారో వారి అవగాహన స్థాయి ఏమిటో వారి సంసిద్ధత ఏ పాటిదో స్పష్టంగా తెలియకుండా భవిష్యత్ గురించి మార్గనిర్దేశనం చేసుకోలేము. అందుకే ఈసారి అన్ని జిల్లాశాఖల సభలు పూర్తిచేసుకున్న తరువాతనే రాష్ట్ర మహాసభలు జరుపుకోవాలని నిర్ణయించుకొన్నాము. దానికోసం మే నెలలో జరగవలసిన సభలను అక్టోబర్‌కు వాయిదా వేసుకొన్నాము. మొదటి రెండు రాష్ట్ర మహాసభలలో ఇది జరుగకపోవడం వలన నిర్మాణాన్ని గురించి ఖచ్చితమైన అవగాహన లేకుండింది.

ఈసారి చిత్తూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాలు తప్ప తక్కిన అన్ని జిల్లా శాఖల సభలు ఇప్పటికే జరుపుకున్నాము. అనంతపురం జిల్లాశాఖ సభ ఈ సాయంత్రం జరగనుంది. అన్ని జిల్లాల్లోను సభ్యత్వాన్ని స్పష్టపరచుకున్నాము. అంతకుముందు కొన్ని సందర్భాలలో మన సంస్థలో సభ్యత్వం తీసుకోకున్నా మనతో కలసి వస్తున్న వారిని మన సభ్యులుగానే భావించి పనిచేయడం జరిగింది. అలా చేయడం వల్ల మన సామర్థ్యం ఎంత అనేది అస్పష్టంగానే వుండిపోయింది. సభ్యత్వం తీసుకోకున్నా కలిసి వచ్చే వారితో కలిసి పనిచేయడానికి అభ్యంతరం వుండనవసరం లేదుగానీ, నిర్మాణం విషయంలో అస్పష్టత వుండడం వలన ప్రయోజనమేమీ లేదు.

పై మూడు జిల్లా శాఖల పాతసభ్యుల సంఖ్యకు తక్కిన జిల్లాశాఖల సభలలో నమోదైన సభ్యత్వాన్ని కలుపుకుంటే మన సభ్యత్వం ఇప్పుడు 300కు చేరింది. ఇందులో చాలామంది కొత్తవారు. ఆయా ప్రాంతాలలో మనం చేస్తున్న పనికి, తీసుకుంటున్న కార్యక్రమాలకు స్పందించి చేరిన వారు. వారికి మన అజెండా గురించి వుండే అవగాహన పాక్షికంగానే వుంటుంది కాబట్టి వారిని సంపూర్ణమైన అర్థంలో కార్యకర్తలుగా తయారు

చేసుకోవలసిన బాధ్యత సంస్థ బాధ్యులపైన, ప్రత్యేకించి సీనియర్ సభ్యులపైన వుంది. ఈ బాధ్యత సక్రమంగా నిర్వర్తించకపోతే నిర్మాణంలో సాధించిన ప్రగతి తిరోగమించే ప్రమాదం వుంది. ఈ కార్యక్రమాన్ని గురించి చివరలో ఇంకొంచెం చెప్పుకొందాం.

మనం చేస్తున్న పనిని నాలుగు రకాలుగా విడగొట్టి వివరించుకోవడం జరుగుతున్నది. అయితే ఒక ఐదవ కర్తవ్యం కూడా మనం ఈ మధ్య నిర్వహిస్తున్నాము. ఇతర ప్రజా ఉద్యమాలు బలహీనంగా వున్న కారణంగా తలెత్తిన ఈ ఐదవ కర్తవ్యాన్ని నిర్వర్తించవలసిన అవసరం రాబోయే రోజులలో మరింత ఎక్కువగా మనమీద వుండబోతుంది.

**<u>మొదటిది</u>**: అణచివేత ఘటనకు లేక ఉదంతానికి సంబంధించిన నిజనిర్ధారణ. ఇది ప్రాథమిక కర్తవ్యం. దీనిలో బహుశా సభ్యులందరు ఒకసారి కాకపోతే ఒకసారి పాల్గొంటున్నారు. నిజనిర్ధారణ చేపట్టడంలో రెండు లక్ష్యాలున్నాయని మనం గుర్తిస్తున్నాము. 1) పూర్తి వాస్తవాలు తెలుసుకోవడం. పత్రికలలో వచ్చే వార్తలు, వీళ్లువాళ్లు ఇచ్చే సమాచారం తరచుగా అసమగ్రంగా వుంటాయి కాబట్టి ఇది అవసరం. 2) బాధితులకు ఆత్మస్థైర్యం కల్గించడం, తమ హక్కుల గురించి తెలపడం, మనం అండగా నిలబడతామన్న విశ్వాసం కల్గించడం. అయితే ప్రాథమికమైన ఈ విషయ సేకరణ స్థాయిలో కూడా ఆ సమస్యను గురించి అవగాహన లేకపోతే మన కర్తవ్యానికి న్యాయం చేయలేము. ఒక లాకప్ మరణాన్ని గురించి నిజనిర్ధారణ చేసేటప్పుడు కస్టడీ విషయంలో పోలీసులకు వుండే అధికారాలేమిటో, దానికి చట్టము, రాజ్యాంగంలో వుండే పరిమితులేమిటో తెలియకపోతే ఏ ప్రశ్నలు అడగాలో, ఏ సమాచారం సేకరించాలో తెలియదు. అయితే మనం చేపట్టే అన్ని సమస్యలు కేవలం చట్టంతో ముడిపడినవి కావు. అటువంటప్పుడు సమర్థవంతంగా నిజనిర్ధారణ చేయడానికి చట్టసంబంధమైన అవగాహనే కాక సామాజిక అవగాహన కూడా అవసరం. ఉదా: బలవంతపు భూసేకరణ నుండి ఉత్పన్నమైన సమస్యల గురించి విషయ సేకరణ చేసేటప్పుడు భూసేకరణ చట్టం గురించే కాక వ్యవసాయ స్థితిగతులు, ప్రత్యామ్నాయ ఆర్థిక అవకాశాల గురించి కూడా అవగాహన లేకపోతే బాధితులను ఏ ప్రశ్నలు అడగాలో తెలియదు. ఏ వాస్తవాలు సేకరించాలో తెలియదు. తెలియకుండా కేవలం సానుభూతితో విషయ సేకరణ చేసినట్లయితే దాని ఆధారంగా పెట్టే విమర్శకు పదును వుండదు. డిమాండ్లకు నిర్దిష్టత వుండదు.

అందువలన వివిధ హక్కుల అంశాల గురించి చాలా నిర్దిష్టమైన అవగాహన కార్యకర్తలకు కల్గించడం అవసరం. ఈ మధ్యకాలంలో దీనిమీద కొంత దృష్టి పెడుతున్నాము. కానీ ఇంకా చాలా పెట్టవలసి వుంది. వరంగల్ జిల్లా శాఖ ఎప్పటికప్పుడు సమాజంలో చర్చలో వున్న అంశాలపైన హక్కుల కోణం నుండి సెమినార్లు నిర్వహించే మంచి సంప్రదాయాన్ని అమలు చేస్తున్నది. గడచిన రెండేళ్లకాలంలో కాశ్మీరులో అమర్‌నాథ్ భూమి వివాదం, శ్రీలంకలోని అంతర్యుద్ధం, వైద్యసేవల ప్రైవేటీకరణ, ఒరిస్సాలో క్రైస్తవులపైన దాడులు మొదలైన అంశాలపైన ఇటువంటి సెమినార్లు నిర్వహించింది. ఒక్కొక్కసారి మనతో ఏకీభవించని వారిని కూడా వక్తలుగా ఆహ్వానించి వేదిక మీదనే చర్చలు నిర్వహించే ప్రయత్నం చేసింది. ఇది సూత్రప్రాయంగా మంచి ఆలోచనే గానీ ప్రజాస్వామ్యం మీద, హేతుబద్ధమైన సంవాదం మీద నమ్మకం లేనివారిని ఆహ్వానించి ఈ అవకాశం కల్పిస్తే వారు గుంపును పోగుచేసి మనలను మాట్లాడకుండా అడ్డుపడగలరు. సంఘపరివార్ వారు వరంగల్‌లో ఆ ప్రయత్నమే చేశారు.

మిగిలిన జిల్లా శాఖలు కూడా వరంగల్ జిల్లాశాఖ మొదలుపెట్టిన ఈ వరవడిని అనుసరించాలి. మన సభలకు, సమావేశాలకు వరంగల్‌లో ఎప్పుడూ మంచి స్పందన ఉంటుంది కాబట్టి ఈ ప్రయత్నం అక్కడ విజయవంతం అయినంత సులభంగా ఇతర జిల్లాలలో కాకపోవచ్చును. అయినప్పటికీ హక్కుల అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కృషి అవసరం. ఎంతమంది హాజరవుతారన్నది ప్రమాణంగా పెట్టుకోకుండా ఎంత అవగాహన కల్గిస్తున్నామనేది చూడటం అలవరచుకోవాలి. అయితే సెమినార్ల వంటివి స్థూలంగా అవగాహన పెంపొందిస్తాయి తప్ప హక్కుల రంగంలో స్వంతంగా పనిచేయడానికి కావలసిన శిక్షణ ఇవ్వవు. ఒక సమస్యకు స్పందించి మనం జనం దగ్గరికి పోయినప్పుడు విషయాన్ని సరైన కోణం నుండి అర్థం చేసుకోవడానికీ సరైన ప్రశ్నలు అడగడానికీ ప్రజల ప్రశ్నలకు జవాబులు చెప్పడానికీ అధికారులు లేక ఇతర ప్రత్యర్థులు చేసే వ్యాఖ్యలకు సమాధానం చెప్పడానికీ అవసరమైన నిర్దిష్టమైన పరిజ్ఞానం, శిక్షణ కార్యకర్తలకు చాలా అవసరం. టోకున వ్యవస్థను, పరిస్థితులను ఖండించడంతో సరిపెట్టుకునే ఉద్యమ సంస్కృతి మనకు మొదటనుండి అలవాటుకాగా, టీవీ మీడియా వచ్చిన తరువాత విజ్ఞానదాయకమైన విశ్లేషణ కంటే ఘాటైన రెండు వాక్యాల వ్యాఖ్యకు విలువ పెరగడం ఈ దురలవాటును పెంచింది. అన్ని ప్రజా సంఘాలు దీనికి లోనుకావడం చూస్తున్నాము. ఈ రకమైన మీడియా ప్రచారం తక్షణ మానసిక సంతృప్తిని ఇవ్వడానికి తప్ప ఇంక దేనికీ పనికి రాదు. హక్కులను హరించే వర్గాలను, పాలనా యంత్రాంగాన్ని ఇది ఏ రకంగాను ఇబ్బంది పెట్టదు.

ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి జరిగిన జిల్లా సభలలో ఏదైనా ఒక అంశం మీద క్లాసురూం లెక్చర్‌లాగా వివరంగా అవగాహన కల్గించే ప్రసంగం ఏర్పాటు చేయాలని అనుకున్నాము. అంతకు ముందు 2008 జూన్ 15వ తేదీన హైదరాబాద్‌లో భూమి హక్కులపైన, డిసెంబర్ 6న వరంగల్‌లో నరేంద్రనాథ్ చేత విద్యుత్‌రంగ సంస్కరణల పైన నిర్వహించిన క్లాసులు ఉపయోగకరంగా వున్నాయని కార్యకర్తలు భావించినందున ఈ నిర్ణయం తీసుకొన్నాము. అయితే దీనిని సరైన స్పిరిట్‌లో అమలు చేసే ప్రయత్నం కొన్ని జిల్లాలలో మాత్రమే జరిగింది. కొన్నిచోట్ల వక్తలకు మన ఉద్దేశ్యం స్పష్టం కాకపోవడం వల్ల వాళ్లు మనమాశించిన సమాచారాన్ని, విశ్లేషణను అందియ్యలేదు. ఎక్కువ జిల్లాల్లో ఎప్పటిలాగా రెండు, మూడు అంశాలమీద స్థూలంగా అవగాహన ఇచ్చే ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు తప్ప ఒకే ఒక్క విషయం మీద లోతైన అవగాహన కల్గించే క్లాసు ఏర్పాటు చేయాలన్న నియమాన్ని అమలు చేయలేదు.

రాబోయే రెండు సంవత్సరాలలో అన్ని జిల్లా శాఖలు ఈ రకమైన అధ్యయన తరగతులు నిర్వహించాలి. బయటివాళ్లను క్లాసు చెప్పమని అడగటంలో తప్పేమీ లేదు కానీ వారికి తరచుగా మన అవసరాలు, అవగాహన స్థాయి తెలియక పూర్తి న్యాయం చేయలేకపోతున్నారు. సంస్థ బాధ్యులే ప్రిపేరై చెప్తే బాగుంటుంది. పోలీసులకుండే అధికారాలు, క్రిమినల్ నేర విచారణ వ్యవస్థలో ముద్దాయి హక్కులు; వ్యవసాయరంగ సంక్షోభం, ఆత్మహత్యలు, వలసలు; భూమి హక్కులు, భూసేకరణ, పునరావాసం; అభివృద్ధి నమూనాలు, ప్రజలు జీవించే హక్కు, సమాన అభివృద్ధి అవకాశాలు; సమాజంలో స్త్రీల స్థితిగతులు, హింసను ప్రోత్సహించే సంస్కృతి, నివారించే చట్టాలు, వాటి అమలు; ఏజెన్సీ చట్టాలు, ఐదవ షెడ్యూలు ప్రాంతాల వాస్తవపరిస్థితి; కులవివక్ష, సామాజిక ఆర్థిక మార్పుల ప్రభావం, వివక్షను అణచివేతను అరికట్టే చట్టాలు, పాలసీలు, వాటి అమలు; పర్యావరణ

సంక్షోభం, పారిశ్రామిక నాగరికత భవిష్యత్తు; ప్రాంతీయ అసమానతలు, ఆకాంక్షలు; పట్టణీకరణలో అసమ అభివృద్ధి; విద్య, వైద్యం, తాగునీరు, రవాణా మొదలైన ప్రాథమిక అవసరాల ప్రైవేటీకరణ ఫలితం; ఖైదీల హక్కులు, జైళ్ళలోని వాస్తవ పరిస్థితి; పనిహక్కు, ఉపాధి హామీ, ఆహారభద్రత; మొదలైన అంశాలపైన అటువంటి క్లాసులు నిర్వహించుకుంటే బాగుంటుంది. వీటిలో ఆయా జిల్లాశాఖలు ఎక్కువ అవసరం అని భావించిన అంశాలతో మొదలుపెట్టి క్లాసుల నిర్వహణ కోసం బాధ్యులను సంప్రదించాలి.

**రెండవది:** నిజనిర్ధారణ ఫలితంగా మనం గుర్తించిన వాస్తవాలను ఆధారం చేసుకొని ప్రస్తుతం అందుబాటులో వున్న చట్టాల పరిధిలో బాధితులకు న్యాయం చేసే ప్రయత్నం. దీనికి మొదట అవగాహన అవసరం. ఆ విషయాన్ని పైన వివరించడం జరిగింది. పోలీసు అధికారులకు గానీ, ఏదైనా ఇతర ప్రభుత్వ అధికారులకు గానీ తగిన వివరాలతో ఫిర్యాదు ఇవ్వడం ద్వారా బాధితులకు చట్టపరంగా న్యాయం చేసే అవకాశం వుంటే వారికి ఆ మేరకు సలహా ఇవ్వడం, ఫిర్యాదు రాసివ్వడం లేదా ఏ విధంగా వ్రాయాలో సూచించడం మనం చేయగల పని. ఇది తరచుగా చేస్తున్నాం. అవగాహన పెంచుకొనే కొద్దీ మరింత సమర్థవంతంగా చేయగల్గుతాం. భూసేకరణ విషయంలో ప్రజలకుండే హక్కులను, జి.ఓ 68 లోని సహాయ పునరావాస విధానాన్ని గడచిన రెండు సంవత్సరాలలో చాలా విస్తృతంగా ప్రచారం చేసి ఏ విధంగా వాటిని అమలు చేసుకోవాలో ప్రజలకు చెప్పగలిగాము. జి.ఓ 68 మన వల్లనే ప్రజలకు పరిచయం అయిందనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఈ ప్రాథమిక దశను దాటి చట్టాల అమలుకోసం ఎక్కువ చేయలేకపోతున్నాం. మనం ప్రజలకు సూచించిన లేదా రాసి ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించిన అధికారి తరచుగా స్పందించడు. తాను చేపట్టవలసిన చర్యలు చేపట్టడు. అప్పుడు అతని పై అధికారికి ఫిర్యాదు చేయడం లేదా ఆందోళన కార్యక్రమం చేపట్టడం, అవకాశం వున్న సందర్భాలలో కోర్టులోగానీ, ఏదైనా పర్యవేక్షక అధికారం గల సంస్థలో గానీ కేసు లేదా ఫిర్యాదు దాఖలు చేయడం జరగాలి. ఇది ఎక్కువగా చేయలేకపోతున్నాం. పై స్థాయి అధికారులను పర్యవేక్షక సంస్థలను కదిలించడానికి జిల్లాకేంద్రాలలోను, రాష్ట్ర రాజధానిలోను ఉన్న బాధ్యులు సమయం కేటాయించవలసిన అవసరం, ఓపిక పెంచుకోవలసిన అవసరం వుంది. తగినంతమంది కార్యకర్తలు లేకపోవడం వల్ల, పని ఒత్తిడివల్ల కేవలం ఒక ప్రయత్నం చేసి విడిచిపెట్టడం జరుగుతున్నది. దీనివల్ల మనం ప్రజలకు ఇప్పుడున్న పరిస్థితులలో చేయగల న్యాయం కూడా చేయలేకపోతున్నాము.

రాష్ట్ర రాజధానికి సంబంధించినంత వరకు ఈ సమస్య గురించి హైదరాబాద్ నగర శాఖ మహాసభలో చర్చించడం జరిగింది. ఇకమీదట హైదరాబాద్‌లో కేవలం మురళి, జీవన్‌కుమార్‌లే కాక ఇంకొక ఐదారు మంది రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు, రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌కు, రాష్ట్ర సమాచార కమీషన్‌కు, లోకాయుక్తకు, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదులు చేయడానికి, జిల్లా శాఖలు పంపిన ఫిర్యాదులను ఫాలోఅప్ చేయడానికి, అవసరమైనపుడు ఆయా సంస్థల ముందు హాజరై ఫలితం రాబట్టడానికి తయారుగా వుంటారు. ఈ విషయంలో ఏ జిల్లా శాఖకు అవసరం ఏర్పడినా హైదరాబాద్ నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సంప్రదించండి. జిల్లాలలో కూడా జిల్లా కేంద్రంలో ఎవరో ఒకరు ఈ కర్తవ్యం మీద దృష్టిపెట్టాలి. నరేంద్రనాథ్ చిత్తూరు జిల్లాలో ఉన్నప్పుడల్లా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ దగ్గర వుండి అధికారులకు ఫిర్యాదులివ్వడం, చర్చించడం, గతంలో ఇచ్చిన ఫిర్యాదులు ఏమయ్యాయని వాకబు చేయడం ఒక పనిగా పెట్టుకునేవాడు. ప్రతిజిల్లాలో ఈ కర్తవ్యం ఎవరో ఒకరు నిర్వర్తించాలి.

పైన పేర్కొన్న సంస్థలను కదలించే విషయంలో చొరవ ఎక్కువ తీసుకోకపోవడానికి అవి పనిచేస్తున్న తీరు కూడా ఒక కారణం. ఏ ప్రకటిత ఉద్దేశ్యంతో అవి నెలకొల్పబడ్డాయో ఆ ఉద్దేశ్యానికి తగ్గట్టు అవేవీ పనిచేయడం లేదు. ప్రత్యేకించి ప్రజలు విరివిగా ఫిర్యాదులు పంపే రాష్ట్ర మానవ హక్కుల కమీషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ల నుండి బాధితులకు ఎక్కువ భాగం నిరాశ ఎదురౌతున్నది. ఫిర్యాదులు స్వీకరించడం, ఎదుటివారి వివరణ కోరడం, ఫైలు మూసేయడం తరచుగా జరిగే తంతు. మనం ఈ విషయాన్ని గుర్తిస్తున్నాము. ఎప్పుడు సందర్భం వచ్చినా ఆ సంస్థల పనితీరుపైన విమర్శలు పెడుతున్నాం. అదేసమయంలో ఇవన్నీ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు సమాధానంగా పుట్టిన సంస్థలని గుర్తించి వాటిచేత పనిచేయించడానికి కృషిచేస్తున్నాము. అవి పనిచేయవు అని వదిలేస్తే అటువంటి సంస్థలు, వేదికలు వుండనక్కరలేదని భావించేవారికి ప్రయోజనమే తప్ప వాటి అవసరం వున్నవారికి కాదు. వాటి వైఫల్యం మీద విమర్శపెడుతూ అదేసమయంలో అవి ఏవిధంగా పనిచేయాలో నొక్కిచెబుతూ వాటిపైన ఒత్తిడి పెట్టడమే ఒక హక్కుల సంఘంగా సరైన వైఖరి అవుతుంది. ఇది ఫలితం ఇవ్వగలదనడానికి కృష్ణా జిల్లా పోలాటితిప్ప దగ్గర ప్రతిపాదించబడి ఆగిపోయిన థర్మల్‌ప్లాంట్‌ను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అది తీర ప్రాంత నియంత్రిత జోన్–I (సి.ఆర్.జడ్–I) లో వుందనీ దానికి అనుమతి ఇవ్వడానికి వీలులేదనీ మనం, పర్యావరణవాదులు అనగా సి.ఆర్.జడ్–III లో వుంది కాబట్టి ఇవ్వవచ్చని అధికారులు మొదట దబాయించారు. అయితే చివరకు వాస్తవాన్ని ఒప్పుకొని ఆ ప్లాంట్‌కు ఇచ్చిన అనుమతిని రద్దుచేశారు.

ఈ ఒక్క విషయంలోనే కాదు. అన్ని సందర్భాలలోను పర్యావరణానికి సంబంధించి అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తున్నాం. పర్యావరణ అనుమతికి అవసరమైన ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను ప్రహసనంగా మార్చారు. కాలుష్యానికి సంబంధించిన నివేదిక ప్రజలకు అందుబాటులో వుంచకుండా, అందులోని సాంకేతిక విషయాలను ప్రజలకు వివరించకుండా, అసలు ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకోసం జరుపుతున్నారో చెప్పకుండా 'కలెక్టర్ మీటింగ్ పెడుతున్నారు, మీ సమస్యలను చెప్పుకోండి' అంటూ సభలు నిర్వహిస్తున్నారు. ఈ మధ్య కరీంనగర్ జిల్లాలో రామగుండం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు – 2 (ఓ.సి.పి–2) విషయంలోను, శ్రీకాకుళం జిల్లా సోంపేట సమీపంలో నెలకొల్పుతున్న నాగార్జునా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వారి థర్మల్ ప్లాంట్ విషయంలోను ఇటువంటి ప్రహసనాలను సాగనివ్వకుండా ఆపడానికి ఏమి చేయాలో ప్రజలకు మనం సంబంధిత గ్రామాలలో పర్యటించి వివరించాము. ప్రజాభిప్రాయ సేకరణ బహిష్కరిస్తే, హాజరైన కొద్దిమందితోనే విజయవంతంగా జరిగిందని నివేదిక రాసుకుంటారు కాబట్టి అందర్నీ హాజరు కమ్మని సలహా ఇచ్చాము. హాజరై, పర్యావరణ నివేదిక పూర్తి సారాంశాన్ని తెలుగులోనికి అనువదించి ప్రతి గ్రామానికి ఇచ్చి గ్రామస్తుల సందేహాలన్నీ నివృత్తి చేసేదాకా ప్రజాభిప్రాయ సేకరణ చేయవద్దని డిమాండ్ చేయవలసిందిగా సూచించాము. రెండుచోట్లా ప్రజలు అదేవిధంగా నడుచుకొని ఇక ముందు కూడా తమ హక్కుల రక్షణ కోసం ఉద్యమించడానికి సిద్ధంగా వుండటం సంతోషం కల్గించే విషయం.

రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ వ్యవహార శైలి చాలా అసంతృప్తిగా వున్నప్పటికీ పట్టుదలగా దానిచేత పనిచేయించే ప్రయత్నం చేస్తుండటం ఒక కేసులో ఈ మధ్య ఫలితం ఇచ్చింది. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన సాలపక్షి గోపి అనే మైనార్టీ తీరని దొమ్మర కులానికి చెందిన ఇంటర్ విద్యార్థి తన క్లాస్‌మేట్ అయిన

వెలమకులస్తురాలితో స్నేహంగా వున్న పాపానికి ఆ అమ్మాయి బంధువులు అతన్ని చాలా అవమానకరంగా హింసించి తప్పుడు కేసుపెట్టి పోలీసులకు అప్పగించగా పోలీసులు అతనిని లాకప్‌లో పెట్టారు. ఆ అవమానానికి అతను లాకప్‌లో ఆత్మహత్య చేసుకొన్నాడు. 2005 జనవరిలో జరిగిన ఈ సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌లో గోపీ తండ్రి సాలపక్షి పోలయ్య చేత ఫిర్యాదు వేయించి, దానిని నడపడంలో సహకరిస్తున్నాము. ఈ మధ్యనే గోపీ కుటుంబానికి లక్ష రూపాయల నష్టపరిహారం లభించింది. గోపీ మరణానికి బాధ్యులైన వారిపై చర్యకోసం ప్రయత్నం కొనసాగిస్తున్నాము.

ఇటువంటి ప్రయత్నాలు ఒకవైపు చేస్తూనే ఈ సంస్థల వ్యవహార శైలి పైన ఇప్పటివరకు సంస్థాగతమైన చర్చలకే ఎక్కువగా పరిమితమై పెడుతున్న విమర్శలను బహిరంగంగా, నిర్మొహమాటంగా చేపట్టవలసి వుంది. ఒక్కొక్క ఉదంతాన్ని ఉదాహరణగా తీసుకొని కరపత్రాలు వేయడం, పత్రికలలో రాయడం, వ్రాయించడం ఇక మీదట ఒక పనిగా పెట్టుకుందాము.

అప్పులబాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు, చేనేత కార్మికుల కుటుంబాలకు బాకీ తీర్చడానికి యాభై వేలు, కుటుంబం గడవడానికి ఒక లక్ష ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం ప్రకటించి జి.ఓలు జారీ చేసింది. అయితే అమలు చేసేక్రమంలో ఈ జి.ఓలను కుదించి వ్యాఖ్యానించి వీలైనంత తక్కువ కేసులలో నష్టపరిహారం ఇచ్చి తప్పించుకునే వైఖరిని అధికారులు అమలు చేస్తున్నారు. మనం వారు తిరస్కరించిన కేసులను చేపట్టి, వాస్తవాలు సేకరించి, పునఃపరిశీలించి న్యాయం చేయమని అధికారులపైన ఒత్తిడి పెట్టాలని అనుకుంటున్నాము. అయితే ఈ కర్తవ్యం సరిగా అమలుకావడం లేదు. ఈ రెండేళ్లకాలంలో కరీంనగర్ జిల్లాలో ఆత్మహత్య చేసుకొన్న నేత కార్మికుల కుటుంబాలకు మాత్రం కొంత న్యాయం చేయగలిగాం. ఈ సంవత్సరం రైతుల ఆత్మహత్యలు చాలా జరిగాయి కాబట్టి ఈ కర్తవ్యాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలి.

అటవీహక్కుల చట్టం, ఉపాధిహామీ చట్టం, ఈమధ్యకాలంలో జారీ అయిన హర్షించదగ్గ శాసనాలు. వాటి సక్రమ అమలు కోసం పనిచేయడం మన బాధ్యత. ఉపాధి హామీ చట్టం అమలు గురించి మనం గడచిన రెండు సంవత్సరాలలో అడపాదడపా నిజనిర్ధారణ కమిటీల ద్వారా విషయాలు సేకరిస్తున్నాము. సంబంధింత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాము. ఈ కృషిని ఇంకా చాలా పెంచవలసిన అవసరం వుంది. ఈ చట్టం మొట్టమొదటిసారిగా భారతదేశ ప్రజలకు పనిహక్కు కల్పించిందని గుర్తించినట్టయితే మనం చేయగల కృషికి వుండే ప్రాముఖ్యం అర్థం అవుతుంది. అటవీ హక్కుల చట్టం కూడా అసాధారణమైనదే. అది పోడుభూములకు వ్యక్తిగతపట్టాలు, ఉమ్మడిగా అడవులలో ప్రజలు అనుభవిస్తున్న హక్కులకు ఉమ్మడి పట్టాలు ఇస్తుంది. 'ఇన్నాళ్లూ దేశ అటవీవిధానాలు ఆదివాసులకు అన్యాయం చేశాయి' అని పార్లమెంట్ ఆ చట్టం ప్రవేశికలో ప్రకటించింది. ఆ చట్టం కింద పట్టాలు మంజూరి జరుగుతున్నది గానీ, అటవీశాఖ సిబ్బంది దానిని కుదించడానికి ప్రయత్నం చేస్తున్నారు. అటవీహక్కుల నిర్ధారణలో వారికి ఏ పాత్రా లేకున్నా పెత్తనం చేస్తున్నారు. అటవీప్రాంతం అధికంగా వున్న జిల్లాలలో మనం ఈ చట్టం అమలుమీద దృష్టిపెట్టి అడవివాసులకు పూర్తి న్యాయం జరిగేటట్లు చూడాలి. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రమే ఇప్పటికి ఈ ప్రయత్నం కొంతచేశాము.

రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌కు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు, కాలుష్యనియంత్రణ మండలికి ఫిర్యాదులు ఇవ్వమని మనం ప్రజలను ప్రోత్సహిస్తున్నాం గానీ, కోర్టులో కేసులు వేయమని ఎప్పుడో తప్ప

సలహా ఇవ్వడం లేదు. చట్టం పరిధిలో స్పష్టమైన హక్కులుండి, కోర్టులో కేసువేస్తే న్యాయం జరుగుతుందను కున్నప్పుడు, ఆ మేరకు మాత్రమే కోర్టును ఆశ్రయించమని సలహా ఇస్తున్నాము. ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వేయమన్న సలహా ఇవ్వకపోవడమే కాక వేయవద్దని కూడా చెబుతున్నాము. దీనికి కారణమేమిటంటే హైకోర్టులో కేసువేస్తే ప్రజలు ఇక ఆందోళన చేయనక్కరలేదని భావిస్తారు. తరచుగా, తాత్కాలిక స్టే ఉత్తర్వుల లాంటివి లభిస్తాయి. అయితే ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను కోర్టులు స్వీకరిస్తాయి కానీ, ప్రజా ప్రయోజనానికి చివరకు న్యాయం జరిగే సందర్భాలు అరుదు. కొంత కాలం తరువాత కేసు కొట్టివేస్తే ఆందోళన చేయాలన్న సంకల్పం వుండదు. ఒకవేళ చేసినా కూడా హైకోర్టు మీ కేసు కొట్టివేసింది కాబట్టి ఇక మీరేం మొత్తుకొన్నా విననక్కరలేదని ప్రభుత్వం ఎదురు దబాయిస్తుంది. మానవ హక్కుల కమీషన్, ఎస్సీ, ఎస్టీ కమీషన్, లోకాయుక్త వంటి సంస్థల విషయానికొస్తే, వాటికి ప్రభుత్వాన్ని ఆదేశించే అధికారాలేమీ లేవు. ప్రజల కళ్లలో కూడా ప్రజా ప్రయోజన వ్యాజ్యం అనే దానికున్న సర్వరోగ నివారిణి గుణం ఈ సంస్థలు చేపట్టే విచారణలకు లేదు. కాబట్టి ఈ సంస్థలకు ఫిర్యాదు చేసినా కూడా ప్రజలు ఆందోళనలు ఆపరు. మరి ఈ సంస్థలకు ఫిర్యాదులు ఇచ్చి ఏం ప్రయోజనం అంటే ప్రజలకు ఇవ్వని సమాచారం, ప్రజల ముందు చేయని వాదన ప్రభుత్వం ఈ సంస్థల ముందు పెడుతుంది. ఆ సమాచారం ప్రజలకు ఆ సంస్థల ద్వారా లభ్యమౌతుంది. అప్పుడప్పుడు కొంత తాత్కాలిక ఊరట కూడా లభించవచ్చు.

మనమే కోర్టులో కేసువేయాలని ఈ మధ్య తీసుకున్న నిర్ణయం కడప జిల్లాలో ఒకటుంది. అది బ్రాహ్మణి స్టీల్స్ యాజమాన్యం మైలవరం రిజర్వాయర్‌కు అడ్డంగా రోడ్డువేసి రిజర్వాయర్ మధ్య నుండి నీళ్లు తీసుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్న ఉదంతానికి సంబంధించినది. వారికిచ్చిన అనుమతి ఫోర్‌షోర్ నుండి తీసుకోవడానికి కాగా, ఏకంగా రిజర్వాయర్ మధ్యనుండి తీసుకోవడానికి వారు ఏర్పాట్లు చేసుకొన్నారు. అందరి కళ్లముందే జరుగుతున్నా అధికారులు చూస్తూ ఊరుకున్నారు. చివరకు ఒక పత్రికలో విషయం బయటికొచ్చేసరికి ఆపించారు గానీ, చేసిన నష్టానికి క్రిమినల్ కేసు పెట్టలేదు. మనమే పెడదామని నిర్ణయించుకొన్నాము.

రెండవది ఏజెన్సీలో ప్రతిసంవత్సరం పెద్దఎత్తున ఆదివాసుల మరణాలకు కారణం అవుతున్న అధికార వ్యవస్థల వైఫల్యాన్ని గురించి. 1998 నుండి ఈ విషయంలో మనం నిజనిర్ధారణ చేస్తున్నాము. పరిశుభ్రమైన మంచినీళ్లు సరఫరా చేయకపోవడం, పారిశుధ్య వైఫల్యం, పౌష్టికాహార లోపం, వైద్య వ్యవస్థ ఘోర వైఫల్యం దీనికి కారణమని వివరిస్తున్నాము. ప్రచారం చేస్తున్నాము. 2005వ సం॥లో జాతీయ మానవ హక్కుల కమీషన్ ఆదేశం మేరకు మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి కె.ఆర్. వేణుగోపాల్ తయారు చేసిన నివేదిక సారాంశాన్ని కరపత్రంగా అచ్చువేసి ప్రచారంలో పెట్టాము. ఈ సంవత్సరం ఒక్క ఆదిలాబాద్ ఏజెన్సీలోనే అధికారికంగా 135 మంది చనిపోయారు. విశాఖపట్నం, తూర్పుగోదావరి ఏజెన్సీలలోను మరణాలు సంభవించాయి. ఈ నేపథ్యంలో హైకోర్టులో కేసు వేసి కె.ఆర్. వేణుగోపాల్‌గారి నివేదిక సూచనలు అమలు చేయమన్న నిర్దిష్టమైన ఆదేశాన్ని కోరుదామని నిర్ణయించుకొన్నాం.

ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడానికి బాధితులు గానీ, ఇతర ప్రజాసంఘాలు గానీ కలిసిరావలసిన అవసరం వుంది. గట్టిగా నిలబడి న్యాయం కోసం పోరాటం చేస్తున్న విశాఖపట్నం జిల్లా వాకపల్లి ఆదివాసీ

మహిళల ఆందోళనలో మనం ఆదివాసీ సంఘాలతో పాటు మొదటినుండి పాల్గొంటున్నాం. 20 ఆగష్టు, 2007సం॥ నాడు గ్రేహౌండ్స్ ఆ ఊరిపై పడి 11 మంది స్త్రీలపైన లైంగిక హింసకు పాల్పడ్డారు. పోలీసులు ఏ పరిశోధనా చేయకుండా అది అబద్ధపు ఆరోపణ అని కేసు మూసివేయగా బాధితురాళ్లకు ప్రైవేట్ కంప్లయింట్ వేయడానికి సహకరించాం. గ్రేహౌండ్స్ పోలీసులు ప్రైవేట్ కంప్లయింట్ పైన హైకోర్టులో స్టే తెచ్చుకోగా స్టే ఎత్తివేయించడానికి హైకోర్టులో కృషి చేశాము. హైకోర్టు స్టే పొడిగించడంపైన సుప్రీంకోర్టుకు అప్పీలు చేశాము.

దళితులు, స్త్రీలపైన జరిగే అత్యాచార విషయంలో బాధితులే రాజీపడి ఆందోళన వద్దనుకోవడం తరచుగా ఎదురౌతున్న బాధాకరమైన పరిస్థితి. న్యాయాన్యాయాలతో నిమిత్తం లేకుండా రాజీ చేయించడమే కర్తవ్యంగా పెట్టుకున్నవాళ్లు సమాజంలో చాలామంది వున్నారు. కొందరు తమ రాజకీయ ప్రయోజనాల కోసం, కొందరు ఆర్థిక ప్రయోజనం కోసం ఈ పని చేస్తున్నారు. ఇందులో రాజకీయ నాయకుల నుండి ప్రజాసంఘాల నాయకులుగా చలామణి అయ్యేవారి దాకా పలురకాల వారున్నారు. మనం తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్న హామీ ఇవ్వలేని కారణంగా రాజీపడి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టవద్దని బాధితులకు నచ్చచెప్పడంలో సఫలం కాలేకపోతున్నాము. రాజీ చేయించే వాళ్ల ఉద్దేశ్యాలను, వారు చేస్తున్న సామాజిక అన్యాయాన్ని ఎండగడుతూ ప్రచారం చేయడం అవసరం.

రాజకీయ నాయకులు, పెత్తందార్ల విషయంలో మనకు ఇబ్బంది ఏమీ లేదుకానీ, ప్రజాసంఘాల పేరుతో పనిచేస్తున్న వారి విషయంలో కొంత మొహమాటపడటం సహజం. అయితే అటువంటి మొహమాటం అనవసరం. ప్రత్యేకించి దళిత సంఘాల పేరుతో పనిచేస్తూ దళారి పాత్ర నిర్వహిస్తున్న వారి మీద ప్రత్యక్షంగానే విమర్శపెట్టడం అవసరం. ఈ విషయంలో మొహమాటం దళితులకే నష్టం చేస్తుంది తప్ప వేరెవ్వరికి కాదు. గట్టిగా నిలబడితే న్యాయం జరుగగల ఎన్నో కేసులు మన కళ్లముందే అన్యాయమైన రాజీలతో ముగియడం చూస్తున్నాం.

**__మూడవది:__** ప్రస్తుతమున్న చట్టాలు, నియమాలలో న్యాయానికి ఆస్కారం లేనప్పుడు ఆందోళనే ఏకైక మార్గం. దీనికి బాధితులను, ప్రజాసంఘాలను కదిలించడం అవసరం. బలవంతపు భూసేకరణ, విధ్వంసకరమైన అభివృద్ధి పథకాలు, నివాస హక్కులు ఈ కోవకు చెందిన ప్రముఖ ఉదాహరణలు. భూసేకరణ విషయంలో భూమికి నష్టపరిహారం పొందేహక్కు ఒక్కటే ప్రజలకు వుందని చట్టాలు అంటాయి. అభివృద్ధి పేరుమీద ఏమి చేసినా న్యాయస్థానాలు జోక్యం చేసుకోవనేది సుప్రీంకోర్టు ఈ మధ్యకాలంలో తీసుకున్న వైఖరి. ప్రతి కుటుంబానికి వుండటానికి ఒక చిన్న గూడైనా వుండాలనే కనీస హక్కుకు రాజ్యాంగంలో చోటు లేదు. అందువలన ఈ విషయాలలో ఆందోళన తప్ప గత్యంతరం లేదు.

నివాస హక్కుల సమస్య హైదరాబాద్, విశాఖపట్నంలలో ఇప్పటికే తీవ్రరూపం తీసుకుంది. ఇంకా తీసుకోబోతుంది. ఈ రెండు నగరాలకు చుట్టూ వున్న విశాల గ్రామీణ ప్రాంతాలను చేర్చి "గ్రేటర్" అని పేరుపెట్టి నగర ఆధునీకరణ కోసం, అభివృద్ధి కోసం అన్ని అవసరాలను, అందరి హక్కులను హరించే ప్రక్రియ నడుస్తున్నది. ఇందులో ముఖ్యంగా దెబ్బతినబోయేది నగరంలో కూలి చేసుకోవడానికి వచ్చి, వుండడానికి చోటులేక ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్న పేదల నివాస హక్కు. అకస్మాత్తుగా ఇళ్లపైన

దాడిచేసి కూల్చివేసి కట్టుబట్టలతో ప్రజలను నగరం బయటికి తరలించడం తరచుగా జరుగుతున్నది. వారిని నగరంలోనే వుండనిచ్చి నగర అభివృద్ధిలో భాగం చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఇప్పటి వరకు మనం ఇటువంటి దాడులు జరిగినప్పుడు అక్కడకు పోవడం, బాధితుల నిరసనకు మద్దతు తెలపడం, అప్పుడప్పుడు ప్రభుత్వ అధికారులతో వాదులాడడం జరుగుతున్నది. హైదరాబాదులో ఈ పని సైతం మనం స్వతంత్రంగా చేయకుండా నివాస హక్కుల సంస్థ అయిన ఛత్రి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మాత్రమే జరుగుతున్నదన్న విషయం 10 సంవత్సరాల సమీక్ష సందర్భంగా గుర్తించి దానిని ఇక మీదట సవరించుకోవాలని నిర్ణయించుకున్నాం. ఛత్రితో గానీ, మరొక సంస్థతో గానీ కలసి పనిచేయవద్దని మన ఉద్దేశ్యం కాదు. మనం మనంగా పనిచేస్తూ ఇతరులతో కూడా కలిసి పనిచేయాలి.

హైదరాబాదులో ప్రభుత్వ స్థలాలలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి ఆవాసాలను క్రమబద్ధీకరించి వారికి భూమి హక్కులు కల్పించే ప్రకటిత లక్ష్యంతో ప్రభుత్వం 2008 సం॥లో జి.ఓ నం. 166 జారీ చేసింది. అయితే దానికి పెట్టిన షరతుల కారణంగా (నివాసానికి సాక్ష్యం వుండాలి, ఆ స్థలం వేరే అవసరాలకు కేటాయించబడి వుండకూడదు వగైరా) పేదల అర్జీలను ఎక్కువ భాగం తిరస్కరిస్తున్నారు. అక్రమ బిల్డింగుల క్రమబద్దీకరణ మాత్రం సునాయాసంగా జరిగిపోతున్నది. గృహ నిర్మాణ శాఖమంత్రి శిల్పామోహన్‌రెడ్డి ఆక్రమణను ఈ జి.ఓ కింద క్రమబద్ధీకరించడంతో ఇది వార్తలకెక్కింది. ఈ జి.ఓ లోని షరతులను తొలగించి పేద గుడిసెవాసులందరికి నివాస హక్కు కల్పించాలన్న డిమాండుతో ఆందోళన చేపట్టవలసిన అవసరం వుంది. సంబంధిత ప్రజలను, ఇతర సంఘాలను కలుపుకొని ఈ ఆందోళన ఏవిధంగా చేపట్టాలో నిర్ణయించుకోవాల్సి వుంది.

హైదరాబాదులోనే కాక ఇతర పెద్ద పట్టణాలలో కూడా అపార్ట్‌మెంట్లు, కాంప్లెక్స్‌లు ఏర్పడుతున్నాయి. ఇవి ఊరిచివర లేక ఊరి బయట టౌన్‌షిప్పుల రూపంలో వుంటాయి. అక్కడ పనిచేసే వారికి నివాసాలు దగ్గరలో వుండడం అవసరం. టౌన్‌షిప్పులలోనే వారికి నివాసాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ధైర్యం చేసి ఒక జి.ఓ జారీచేసింది. కానీ బిల్డర్లు దానిని కోర్టులో సవాలు చేయడమే కాక, తమకు రాజకీయ వర్గాలలో వున్న ప్రాబల్యాన్ని వాడుకొని దానిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే కొంత తలొగ్గింది. మనం, ఇతర సంఘాలు జోక్యం చేసుకొనకపోతే ఒక సదుద్దేశ్యంతో మొదలైన ప్రయత్నం నిష్ఫలంగా ముగిసే ప్రమాదం వుంది. ఆ ప్రయత్నం మొదలుపెట్టాము.

నిజానికి నగరంలో హక్కుల సమస్యలు చాలా వున్నాయి. నివాసం, రవాణా, పర్యావరణం, వలస కార్మికులు ఎదుర్కొనే అనేక సమస్యలు (కనీస వేతనాలు, స్త్రీల అభద్రత, ఆరోగ్యం, పిల్లల చదువులు వగైరా). రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సందర్భంగా వీటన్నింటి గురించి ప్రచారం మొదలుపెడతాం. ఇవాల్టి హైదరాబాద్ రేపటి ఇతర పట్టణాల ముఖాల్ని చూపిస్తుంది కాబట్టి ఈ కార్యక్రమం రాష్ట్రమంతటికీ స్ఫూర్తిదాయకంగా వుండగలదు.

బలవంతపు భూసేకరణ, విధ్వంసక అభివృద్ధి విధానాలకు వ్యతిరేకంగా ప్రచార, ఆందోళన కార్యక్రమాలు ఈ రెండు సంవత్సరాలలో బాగానే చేపట్టగలిగాము. సంబంధిత ప్రాంతాలలో ఒక గుంపుగా నినాదాలిస్తూ, మాట్లాడుతూ ప్రచార యాత్ర చేపట్టే ప్రక్రియను ఫలవంతంగా వాడుకొన్నాము. ఉత్తరాంధ్ర జిల్లాలలో వివిధప్రజా

సంఘాలతో కలిసి కోస్టల్ కారిడార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ప్రచార యాత్రలో మనమే ముఖ్యపాత్ర నిర్వహించాము. ఎన్నికలకు ముందు తాత్కాలికంగా కోస్టల్ కారిడార్ విషయంలో కొంత వెనక్కు తగ్గినట్టు కనిపించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ దాని అమలు దిశగా చురుగ్గా కదులుతున్నది కాబట్టి ఆ ఆందోళన కార్యక్రమాన్ని మళ్లీ చేపట్టవలసి వుంది. సంస్థ ఏర్పడి 10 సంవత్సరాలు గడచిన సందర్భంగా విధ్వంసక అభివృద్ధి విధానాలకు వ్యతిరేకంగా శ్రీకాకుళం, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ మరియు గుంటూరు జిల్లాలలో 2008 నవంబర్ నెలలో ప్రచార యాత్ర చేపట్టాము. ఇది జనరల్ కార్యక్రమం కాగా నిర్దిష్టంగా ఒక థర్మల్ ప్లాంట్, ఒక సెజ్, ఒక ఓపెన్ కాస్ట్ బొగ్గుగనికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడానికి అవసరమైన చైతన్యాన్ని ప్రజలకు కల్గించి వారి ఆందోళనలో పాల్గొంటున్నాము. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులకు వ్యతిరేకంగా, శ్రీకాకుళంలోని తీర ప్రాంతాలలో పుష్కలమైన నీటివనరుల మధ్య నెలకొల్పుతున్న థర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలలో మన పాత్ర చెప్పుకోతగ్గ మోతాదులో వుంది.

సెజ్‌ల గురించి అవగాహన కల్గించడానికి హైదరాబాద్‌లో 2008 సం॥ మార్చి 9వ తేదీన సెమినార్ నిర్వహించాం. ఆ సందర్భంగా వేసిన కరపత్రం రాష్ట్ర వ్యాప్తంగా పంచాం. నిజానికి చిత్తూరు జిల్లా సత్యవేడు, వరదాయపాళెం మండలాలలో ఏర్పడిన "శ్రీసిటీ" సెజ్‌కు వ్యతిరేకంగా సెప్టెంబర్ 2007లో మనం వేసిన కరపత్రమే రాష్ట్రంలో సెజ్‌లపైన మొట్టమొదటి విమర్శ. ఆ తరువాతే ఇతర సంస్థలు మాట్లాడడం మొదలుపెట్టాయి. కడప జిల్లాలో ప్రొద్దుటూరు పట్టణానికి తాగునీరివ్వడానికి 1000 ఎకరాల సాగుభూమిని ముంచే కాలువ త్రవ్వే ప్రతిపాదనను విమర్శిస్తూ పత్రికల వారితో మాట్లాడడం, కరపత్రం వేయడమే కాక బాధితులతో కలసి రాస్తారోకోను నిర్వహించాము. వరంగల్ జిల్లా భూపాలపల్లి సమీపంలో రైతుల భూములకు ఇచ్చే నష్టపరిహారాన్ని గురించి, భూమిలేని వారికిచ్చే పునరావాసం గురించి ఏ నిర్ణయం చేయకుండా ఓపెన్‌కాస్ట్ కోసం భూమి పూజ చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. మనల్ని కూడా రమ్మని వారు ఆహ్వానించగా వారితో కలసి భూమిపూజ ఆపమన్న ఆందోళనలో పాల్గొని అరెస్టు అయ్యాము. తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ సమీపంలోని సెజ్‌కు వ్యతిరేకంగా ఇప్పటికి రెండు సంవత్సరాలకు పైగా సాగుతున్న ఆందోళనలో మన పాత్ర కొనసాగుతూనే వుంది. కరీంనగర్ జిల్లాలో శ్రీరాంసాగర్ వరదకాలువ, ఎల్లంపల్లి ముంపు గ్రామాల ప్రజలు న్యాయమైన నష్టపరిహారం కోసం సరైన పునరావాసం కోసం చేస్తున్న ఆందోళనలో మనం చురుకుగా పాల్గొంటున్నాం. 2007 సం॥ ఆగష్టు 25న మనమే చొరవ తీసుకొని కరీంనగర్‌లో ధర్నా నిర్వహించాం.

**<u>నాల్గవది:</u>** ప్రజాతంత్ర చైతన్యం, హక్కుల స్పృహ కల్గించడానికి, మానవీయ సంస్కృతిని పెంపొందించడానికి చేసే ప్రచారం. ఇది చాలా కారణాలుగా ఒక ముఖ్యమైన కర్తవ్యం. అన్యాయానికి గురైన వారికి బాధపడమని ఒకరు చెప్పనవసరం లేదు. బాధపడతారు, కోపగించుకుంటారు. కానీ తమకు మనుషులుగా ఒక హక్కు వుందని, అది అతిక్రమించబడిందని చెప్పడం తరచుగా అవసరం అవుతుంది. దానిని గుర్తించే చట్టం వుంటే ఆ చట్టాన్ని గురించి తెలియజేయడం అవసరం అవుతుంది. హక్కుల ప్రచార కార్యక్రమానికి ఇదొక ముఖ్య ప్రయోజనం.

అయితే వేరే ప్రయోజనాలూ వున్నాయి, వేరే పాత్రా వుంది. ఒక హక్కుకు చట్టంలో గుర్తింపు వున్నా, బాధితులు ఆ విషయం ఎరిగినా కూడా దానికి ఒక హక్కుగా సామాజిక చైతన్యంలో ఆమోదం లేకపోతే అది అమలు కావడం కష్టం. అధికార యంత్రాంగం, న్యాయవ్యవస్థ, మీడియా దాని అమలుకు సహకరించవు. సమాజం నుండి వత్తిడి వుండదు. దళితులపైన అత్యాచారాలు, గృహహింస మొదలైన విషయాలలో చట్టాలు అమలు కాకపోవడానికి, చట్టాల దుర్వినియోగం గురించే ఎంతసేపూ చర్చ జరగడానికి ఒక ముఖ్య కారణం – ఆ చట్టాలు కల్పించే హక్కులను హక్కులుగా గుర్తించడానికి సమాజంలో వున్న అయిష్టత, వ్యతిరేకత. ఇటువంటి చట్టాలు ఓటుబ్యాంకు రాజకీయాలలో భాగంగా తీసుకొస్తారన్న తిరస్కార పూరితమైన వ్యాఖ్య ఈ అయిష్టతను కప్పిపెట్టడానికి ఉపయోగించే సాధనం. దీనికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టి ఆ చట్టాలు కల్పిస్తున్న హక్కులు న్యాయమైనవే అన్న అవగాహన సమాజంలో పెంపొందించడం చాలా అవసరం. హక్కుల ఉద్యమం చేపట్టే ప్రచారంలో ఇదొక ముఖ్యభాగం.

పోలీసులకు ఎవర్నీ హింసించే అధికారం, చంపే అధికారం లేదు అని దశాబ్దాలుగా చేసిన ప్రచారం ఫలితాన్ని ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ప్రయత్నం గడచిన రెండు సంవత్సరాలలోనూ కొనసాగించాం. ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డ పోలీసు అధికారిపైన క్రిమినల్ కేసు తప్పనిసరిగా పెట్టనక్కరలేదని రాష్ట్ర హైకోర్టు ఫుల్‌బెంచ్ ఇచ్చిన తీర్పును విమర్శిస్తూ కరపత్రం వేసి చాలాచోట్ల సభలు నిర్వహించాం. ఆ తరువాత ఐదుగురు జడ్జిల బెంచి ఆ తీర్పును రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వివరిస్తూ మళ్ళీ ఒక కరపత్రం వేసి అందులో మిగిలిపోయిన ప్రశ్నలు లేవదీశాము.

జి.ఓ 610 ఒక రాజ్యాంగ సూత్రం అమలును చక్కబెట్టడానికి జారీచేసిన ఆదేశమే అయినప్పటికీ దాని పట్ల తెలంగాణ వెలుపల అహేతుకమైన వ్యతిరేకత వ్యక్తమైన సందర్భంగా దానిని వివరిస్తూ కరపత్రం వేసి రాష్ట్రమంతటా పంచడమే కాక విజయవాడలోను, విశాఖపట్నంలోను సభలు నిర్వహించాము. ఈ విషయం మీద ఇంకింత వివరమైన ప్రచురణ తీసుకురావల్సిన అవసరం వుందన్న అభిప్రాయం మన సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. ఆ పని త్వరలో చేద్దాం.

సమాచారహక్కు చట్టం, గృహ హింస చట్టాలు జారీఅయిన కొత్తలోనే అవి కల్పించే హక్కులను వివరిస్తూ కరపత్రాలు వేసి రాష్ట్రమంతటా పంచాము. ఇది రెండవ రాష్ట్ర మహాసభల కంటే ముందే జరిగింది. సమాచార హక్కు చట్టం పట్ల సమాజంలో ఉత్సాహం వుందిగానీ, అధికారయంత్రాంగం దానినొక తలనొప్పిగా భావిస్తున్నది. గృహహింస చట్టం పట్ల మగవారిలో వ్యతిరేకత చాలా వుంది. ఈ రెండు చట్టాలు అమలుకు సంబంధించి మనకిప్పుడు కొంత అనుభవం వుంది. స్థూలంగా చెప్పాలంటే సమాచార హక్కు చట్టం కింద ఒక అర్జీదారు కోరే సమాచారం అధికార యంత్రాంగం వైఫల్యాలను, తప్పులను, అవినీతిని బయటపెట్టేది కాకపోతే ఇచ్చేస్తున్నారు. బయట పెట్టేదయితే ముప్పుతిప్పలు పెడుతున్నారు. గృహ హింస చట్టం విషయానికొస్తే ప్రొటెక్షన్ ఆఫీసర్లు బాధితురాలి ఫిర్యాదును అధికారిక “ఫారమ్” లో తిరిగి రాసి కోర్టుకు అప్పగించడం తప్ప చేస్తున్న సహాయమేమీ లేదు. కోర్టులు ఆ చట్టంలోని కొత్తదనాన్ని, దాని సామాజిక లక్ష్యాలను గుర్తించకుండా శతకోటి చట్టాలలో ఒక చట్టం అన్నట్లు ఎప్పటిలాగా వ్యవహరిస్తున్నాయి. ఈ వైఖరులను నిర్దిష్టమైన ఉదాహరణలతో విమర్శిస్తూ మరొక దఫా ప్రచారం చేపట్టవలసిన అవసరం వుంది.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని గురించి 2009 సం॥ ఏప్రిల్ 13న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకొన్నాము. ఆ చట్టం జారీ అయి 20 సం॥రాలు గడిచాయి. దీని దుర్వినియోగం గురించి సమాజంలో నిరంతరం చర్చ జరుగుతున్నది. కానీ అది ఎంతవరకు అసలు వినియోగం అయ్యింది, బాధితులకు ఎంతమేరకు న్యాయం జరిగింది అన్న చర్చలేదు. మనం దుర్వినియోగం లేదనడం లేదు, దుర్వినియోగం తప్పు కాదనడం లేదు కానీ ఈ ఇరవై యేళ్లలో ఆ చట్టం తన ప్రకటిత లక్ష్యాన్ని ఎంతమేరకు సాధించగల్గింది అన్న చర్చ, విశ్లేషణ అవసరం. పోలీసు యంత్రాంగం, అధికార విభాగాలు తమ విధులను ఎంత నిర్లక్ష్యం చేస్తున్నాయి, న్యాయస్థానాలు దానిని ఎంతగా కుదించి వ్యాఖ్యానిస్తున్నాయి అన్న చర్చ అవసరం. ఒక వివరమైన కరపత్రం గానీ, చిన్న బుక్‌లెట్‌గానీ ప్రచురించి రాష్ట్ర వ్యాప్తంగా సభలు జరపాలని అనుకున్నాం. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, ఆ తరువాత మన మహాసభలు రావడం వల్ల అది అమలుకాలేదు. మహాసభలు అయిన వెంటనే మొదలుపెట్టాలి. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా శాఖలు అక్టోబర్ నెలలోనే కార్యక్రమం చేపట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి.

అయితే మనం చేపట్టే ప్రచారం, లక్ష్యం ఇక్కడితో అయిపోదు. కొన్ని విషయాలలో చట్టాల పాత్ర చాలా స్వల్పంగా వుంటుంది. సామాజిక చైతన్యం, ఆలోచనా రీతుల ప్రజాస్వామీకరణ వాటి విషయంలో ప్రధానమైన కృషిగా వుంటుంది. ప్రేమ పేరుతో స్త్రీలపైన అమలౌతున్న హింస ఈ మధ్య కాలంలో ప్రముఖంగా ముందుకొచ్చిన ఒక ఉదాహరణ. ఈ చర్యలను ప్రత్యేకమైన నేరాలుగా గుర్తించడానికి చట్టం తీసుకురానున్నట్లు హోం మంత్రి అనగా వింటున్నాం. ఐ.పి.సి. లోని సెక్షన్ 509ని సవరించి మరింత కఠినతరం చేసే ఆలోచన వుందని కూడా ఆమె అన్నారు. ఇది ఆహ్వానించదగ్గ ఆలోచనే కానీ ఈ విషయంలో చట్టం పాత్ర స్వల్పంగానే వుండగలదు. సామాజిక చర్యల పాత్రే ప్రధానంగా వుంటుంది. అదృష్టవశాత్తు ఈ హింస పట్ల కేవలం అమ్మాయిలలోనే కాక, మొత్తంగా సమాజంలో బాగా వ్యతిరేకత వుంది. దానికి కార్యరూపం ఇచ్చే ఆలోచన చేయాలి. ఈ దాడులేవీ అకస్మాత్తుగా జరగవు. ప్రేమ పేరుతో కొంత కాలం వెంటబడి వేధించిన పూర్వ చరిత్ర వుంటుంది. ఆ అమ్మాయి తరచుగా తన ఇంటి వారికి తప్ప ఎవరికీ చెప్పుకోదు. తల్లిదండ్రులు పోయి పోలీసులకు ఒకవేళ ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోరు. కాబట్టి ఆయా ప్రాంతాలలో బాధితురాలు ఫిర్యాదు చేయడానికి ఒక పౌర కమిటీని ఏర్పాటు చేయగలిగితే బాగుంటుంది. ఆ కమిటీ ఆ 'ప్రేమికుడిని' పిలిచి మాట్లాడే ప్రయత్నం చేస్తుంది. ఇది కొన్ని సందర్భాలలో ఫలితమీయవచ్చు. అప్పటికీ వినకపోతే ఆ కమిటీయే పోలీసులతో మాట్లాడి ఆ అమ్మాయి రక్షణ విషయంలో ఒత్తిడి పెట్టవచ్చు. ఈ కర్తవ్యం మనం ఫలప్రదంగా నిర్వర్తించాలంటే ఈ రకమైన దాడులు ఏ సందర్భంలో జరుగుతున్నాయన్న అవగాహన వుండాలి. అందువల్లనే జరిగిన ఘటనల గురించి నిజనిర్ధారణ చేసి సమాచారం సేకరించాలని 2008 సం॥ ఫిబ్రవరి 23 నాటి కార్యవర్గ సమావేశం తీర్మానించింది. అయితే ఏ జిల్లా శాఖా దీనిని అమలు చేయలేదు. పత్రికలలో వచ్చిన సమాచారం తీసుకొని ఈ సమస్య పూర్వాపరాలను వివరిస్తూ కృష్ణాజిల్లా శాఖ కన్వీనర్ కె. సుధ రాసిన వ్యాసం 9వ బులెటిన్‌లో అచ్చువేశాము. మహాసభల నుండి వెనక్కు వెళ్లిన తర్వాత ఆయా జిల్లాలలో ఈ మధ్య జరిగిన ఘటనల గురించి విషయ సేకరణ జరిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పంపించండి. ఒక కరపత్రం అచ్చువేసి రాష్ట్ర వ్యాప్తంగా పంచుదాం. మీ ప్రాంతంలో స్పందించిన వారిని కలుపుకొని వీలైన చోట్ల పౌర కమిటీలు వేయడానికి ప్రయత్నం చేయండి.

ప్రజల హక్కులకు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి, నష్టకరమైన ప్రభుత్వ విధానాలకు, రాజకీయ పోకడలకు వ్యతిరేకంగా కూడా ప్రచారమే మనకు వున్న సాధనం. ఈ రెండేళ్ల కాలంలో భారత్–అమెరికా అణుఒప్పందం మీద, విధ్వంసకరమైన అభివృద్ధి విధానాలమీద విస్తృతంగానే ప్రచారం చేశాము. అణుఒప్పందం గురించి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం చెపుతున్న విషయాలలోను, చూపిస్తున్న కారణాలలోను వున్న వాస్తవం ఎంతో, ఆ ఒప్పంద ఫలితం దేశ రాజకీయ ఆర్థిక భవిష్యత్తుపైన ఏ విధంగా వుండబోతుందో వివరిస్తూ కరపత్రం వేశాము. 9వ బులెటిన్‌లో వివరమైన వ్యాసం వ్రాశాము. చాలాచోట్ల సభలు నిర్వహించాము. అభివృద్ధి విధానాల విధ్వంసక స్వభావం మాటకొస్తే అది ఒక నిత్యప్రచారం అంశంగానే వుంటున్నది. దాని వివిధ కోణాలను వివరిస్తూ 10వ బులెటిన్‌ను ప్రత్యేక సంచికగా తీసుకొచ్చాము. ఈ రెండేళ్లలో ఈ అంశంమీద 15 కరపత్రాలు వేశాము. సంస్థకు 10 సంవత్సరాలు నిండిన సందర్భంగా చేపట్టిన ప్రచార యాత్రలో దీనినే ప్రధాన అంశంగా తీసుకొన్నాము.

దేశంలో కొన్ని ప్రాంతాలలో పెరుగుతున్న సంఘ్ పరివార్ ప్రాబల్యం, దానివల్ల మైనార్టీలకే కాక ప్రజాతంత్ర స్వేచ్ఛలకు కలుగుతున్న విఘాతం మానవ హక్కుల కోణం నుండి చాలా తీవ్రమైన విషయంగా మనం భావిస్తున్నాము. 2008 సం॥లో ఒరిస్సా, కర్ణాటకలలో క్రైస్తవులపైన జరిగిన దాడులకు మనం వెంటనే స్పందించాం. వివిధ హక్కుల సంఘాలతో కలిసి సంబంధిత ప్రాంతాలలో పర్యటించాము. ఈ సంవత్సరం మార్చినెలలో ఇంగ్లీషులో నివేదిక అచ్చయ్యింది. తెలుగులో నివేదికను పనుల భారం వల్ల వెంటనే తేలేక పోయాము. అయితే ఈ సంవత్సరం కర్ణాటకలోని దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలలో బజరంగదళ్, శ్రీరామసేన, హిందూజాగరణ వేదికె తదితర సంఘ్ పరివార్ సంస్థలు భిన్నమతస్తులు కలిసి తిరగకూడదని, ముఖ్యంగా స్త్రీ, పురుషులైతే ఎటువంటి స్నేహసంబంధం పెట్టుకోకూడదని ఆంక్షలు పెట్టి భౌతిక దాడుల ద్వారా వాటిని అమలు చేయడం మొదలుపెట్టారు. స్త్రీల నడవడిక, వేషధారణ తాము భావించే "భారతీయ సంస్కృతి" కి లోబడి వుండాలనే భావనతో వారిని నియంత్రించడానికి దాడులు చేయడం, బహిరంగ స్థలాలలో అవమానపరచడం ప్రారంభించారు. ఇటువంటి సంఘటనలు అనేకం జరిగాయి. వాటిపైన పి.యు.సి.ఎల్. కర్ణాటక రాష్ట్ర శాఖ ప్రచురించిన నివేదికలోని విషయాలను గత సంవత్సరం క్రైస్తవులపైన జరిగిన దాడుల సమాచారంతో చేర్చి ఈ మహాసభల సందర్భంగా "ప్రజాస్వామ్యంపై సంఘ్‌పరివార్ దాడి" అనే శీర్షికతో ప్రచురణ తీసుకొచ్చాము.

**ప్రచురణలు:**

ఈ రెండు సంవత్సరాల కాలంలో మనం 9వ, 10వ బులెటిన్‌లు తీసుకొచ్చాము. నరేంద్రనాథ్ చేసిన సూచనల మేరకు భూసేకరణ చట్టాన్ని వివరిస్తూ "ప్రభుత్వం మీ భూమికోసం వస్తే" అన్న శీర్షికతో చిన్న బుక్‌లెట్ అచ్చువేశాము. ఒరిస్సా, కర్ణాటకలలో సంఘ్‌పరివార్ ఆగడాలపైన ఇంగ్లీషు, తెలుగులో నివేదికలు అచ్చువేశాము. 9వ బులెటిన్‌లో సచార్ కమిటీ రిపోర్టును సమీక్షిస్తూ రాసిన వ్యాసాన్ని "సచార్ చెప్పిన సత్యాలు" అన్న పేరుతో పునర్ముద్రించాము. రాష్ట్ర కమిటీ నిర్ణయంగా 18 కరపత్రాలు వేశాము. అయితే జిల్లా శాఖలు సొంత చొరవతో కరపత్రాలు అచ్చువేసిన సందర్భాలు చాలా తక్కువ. జిల్లా మహాసభలప్పుడు వేసిన కరపత్రాలను మినహాయిస్తే పర్యావరణం మీద శ్రీకాకుళం జిల్లాశాఖ ఒకటి, మనీషా అనే అమ్మాయిని చంపిన

వారిని పోలీసులు హతమార్చిన ఘటన మీద వరంగల్ జిల్లా శాఖ ఒకటి, అభివృద్ధి పేరిట జరుగుతున్న తీరప్రాంత విధ్వంసం మీద నెల్లూరు జిల్లా శాఖ ఒకటి, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల మీద కరీంనగర్ జిల్లా శాఖ ఒకటి, ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌పైన అనంతపురంజిల్లా శాఖ ఒకటి,  మొత్తం ఐదు మాత్రమే ఈ రెండేళ్లలో జిల్లాశాఖలు వేసిన కరపత్రాలు. ఇంకొన్ని కరపత్రాలు కూడా జిల్లా కమిటీల పేరుమీద వెలువడ్డాయి కానీ అవి రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్రకమిటీ అచ్చువేసినవే.

ఇది ఎంతమాత్రం సంతృప్తికరమైన పరిస్థితి కాదు. జిల్లాశాఖలు చేపడుతున్న వివిధ సమస్యలమీద విరివిగా కరపత్రాలు వేయాలి. అయితే కరపత్రాలు అవగాహన కల్పించేవిగా, కర్తవ్యాన్ని నిర్దేశించేవిగా వుండాలి. ఊకదంపుడు వ్యాఖ్యానాలు, పడికట్టుపదాలు వాడొద్దు. వాదన తర్కబద్ధంగా వుండాలి. ఆ నిర్ణయానికి రావడానికి అవసరమైన సమాచారం సేకరించి  కరపత్రంలో చేర్చాలి. రాసే శైలి చదివించేటట్టు వుండాలి.

రాష్ట్ర కమిటీ పంపిన కరపత్రాలను ఎప్పటికప్పుడు పంచడమే కాక, పాతవాటిని కూడా జిరాక్స్ వేసి అన్ని కరపత్రాల సెట్ తయారుచేసి పంచే కార్యక్రమం నెల్లూరు జిల్లాశాఖ పెట్టుకుంది. ఇది మన అవగాహనకు, దృక్పథానికి సమగ్రమైన ప్రచారం కల్పిస్తుంది. మౌఖిక ప్రచారం ప్రధానంగా బహిరంగసభల రూపంలో చేస్తున్నాము.  కేవలం జిల్లా కేంద్రంలోనే కాక చిన్న వూర్లలో కూడా సభలు జరపాలన్న నిర్ణయం పెద్దగా అమలు కాలేదు. అయితే ఈ రెండు సంవత్సరాలలో హ్యాండ్‌మైక్ పెట్టుకొని ప్రచార యాత్ర చేపట్టే పద్ధతి చాలాచోట్ల అనుసరించాము. కానీ ఈ పద్ధతి విస్తృత ప్రజానీకానికి సంబంధించిన సమస్యల విషయంలో మాత్రమే అనుసరించగలము. ఆ పరిధిలో ప్రచార యాత్రల పద్ధతిని మరింత విరివిగా అనుసరించడం అవసరం.

**<u>ఐదవది:</u>** ప్రజలకు సంఘటితం కావడానికి ప్రత్యక్షంగా తోడ్పడటం.  రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు బలంగా వుండి వుంటే మనకు ఈ పాత్ర అంతగా వుండేది కాదు. కానీ రాజకీయ పార్టీలకు అనుబంధమైన ప్రజాసంఘాలైనా స్వతంత్రంగా పనిచేసే ప్రజాసంఘాలైనా విస్తృతిలోను, శక్తిలోను బలహీనంగా వున్నాయి. అందువల్ల అన్యాయానికి గురైన ప్రజలకు మనం వారి హక్కులేమిటో వివరించిన తరువాత మీరే మమ్మల్ని నడిపించండి అని జనం అడగడం జరుగుతున్నది. మనం నడిపించలేము గానీ, ప్రజలనుండే ఉద్యమాన్ని నడిపించగల కమిటీని ఏర్పాటు చేయడానికి కావలసిన సూచనలివ్వడం, ఆ కమిటీకి ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తూ ఉద్యమానికి అడ్వైజర్స్‌గా వుండటం మన బాధ్యత అవుతున్నది. ఇది ఒక రకంగా కాకినాడ సెజ్ విషయంలో అసంకల్పితంగానే మొదలయ్యింది. మనం సెజ్ అంటే ఏమిటో, భూసేకరణ విషయంలో ప్రజలకుండే హక్కులేమిటో వివరించిన తరువాతే కాకినాడ సెజ్ వ్యతిరేక ఉద్యమం ఊపందుకుంది. వాళ్లు ఎప్పటికప్పుడు మన సలహాలు అడుగుతూ నిర్ణయాలు తీసుకొంటున్నారు.

ఈ రెండేళ్ల కాలంలో మనం ఈ పాత్ర చాలా సందర్భాలలో పోషించాము, పోషిస్తున్నాము. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ఓపెన్‌కాస్ట్ బాధిత గ్రామాలలో, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నీటిని నది ఒడ్డున వున్న తమ గ్రామాలకు కూడా ఇవ్వాలని ఆందోళన చేస్తున్న కౌటాల, బెజ్జూరు మండల గ్రామాలలో, శ్రీకాకుళం జిల్లాలోని తీర ప్రాంత నీటి వనరులను నాశనం చేయగల థర్మల్ ప్లాంట్‌లు నెలకొనబోయే

గ్రామాలలో – ఉద్యమ కమిటీలు వేయడానికి, లేదా అప్పటికే ఉద్యమ కమిటీలు ఏర్పడివుంటే వారికి తగిన సలహాలు ఇచ్చి నడిపించడానికి కృషిచేస్తున్నాం. కరీంనగర్ జిల్లాలో శ్రీరాంసాగర్ వరద కాలువ ముంపు గ్రామాల వారు కూడా ప్రాజెక్టు డిజైన్ మార్చి తమ భూములను కాపాడాలన్న ఆందోళనలో మన సలహాలు తీసుకొని నడుచుకుంటున్నారు. కమిటీ ఏర్పాటు చేసేటప్పుడు ఒక్కొక్క పార్టీ నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేయడం, ఆయా పార్టీ గ్రామ ముఖ్యులతో కమిటీ ఏర్పడటం తరుచూ జరుగుతుంది. ఆపైన ఉద్యమం వారి వారి రాజకీయ అవసరాలు , ప్రయోజనాలు, ఒత్తిడులను బట్టి నడుస్తుంది, లేకపోతే నడవకుండా వుండిపోతుంది. మనం అలా కాకుండా గట్టిగా నిలబడే వ్యక్తులతో, నిజాయితీ గల వ్యక్తులతో కమిటీలు వేయమని సూచిస్తున్నాము. ఈ ప్రయత్నం ఇంకా ప్రారంభ దశలో వుంది కాబట్టి దీని ఫలితాలు ఏవిధంగా వుంటాయో ఇప్పుడే చెప్పలేము.

ఈ ఉద్యమాలకు మనం సలహాలు ఇచ్చేటప్పుడు తమ డిమాండ్లలో చట్టపరమైన హక్కుల అమలుకు ప్రాధాన్యం ఇవ్వమని సూచిస్తున్నాము. ఈ ప్రాజెక్టు మాకొద్దు అనో, ప్రాజెక్టు డిజైన్ మార్చండి అనో అనే ముందు ప్రభుత్వం ఇప్పుడున్న చట్టాలు, నియమాల పరిధిలో చేయవలసి వుండి చేయని పనుల మీద దృష్టిపెట్టి వాటికి సంబంధించిన డిమాండ్లు పెడితే ప్రభుత్వం ఇరకాటంలో పడుతుందని సూచిస్తున్నాము. జి.ఓ 68 ప్రకారం అతి తక్కువ విస్థాపన వుండే ప్రత్యామ్నాయాన్ని మొదట అన్వేషించాలి. దానికోసం జాయింట్ కలెక్టర్ హోదా గల అధికారిని నియమించాలి. ఆ పని ఏ ప్రాజెక్టు విషయంలోను చేయలేదు. పర్యావరణ నివేదికను ప్రజలకందుబాటులో వుంచి వారి సందేహాలను నివృత్తి చేయాలి. ఆ పని చేయకుండానే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. భూసేకరణ విషయంలో ఒక్కొక్కరికీ అభ్యంతరాలు తెలుపుకొనే అవకాశం ఇచ్చి వారి అభ్యంతరాలు విడివిడిగా విని విడివిడిగా వారికి ప్రభుత్వం జవాబు చెప్పాలి. ఆ అవకాశం ప్రజలకివ్వకుండా భూసేకరణ చట్టంలోని సెక్షన్ 5–ఎ ను “అర్జెన్సీ” పేరిట మినహాయిస్తున్నారు. భూమి యజమానుల సమ్మతితో నష్టపరిహారం నిర్ణయించేటట్టు అయితే వారితో సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం ఒక త్రిసభ్య కమిటీని నియమించాలి. దానిలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఒక రిటైర్డ్ జిల్లాజడ్జి, ఒక సీనియర్ సివిల్ జడ్జి వుండాలి. అటువంటి కమిటీని నియమించకుండా ఆర్డీఓలు ఇద్దరు ముగ్గురు గ్రామ పెద్దలు అని పిలువబడే పెత్తందార్లను పిలిచి వారితో ఒప్పందానికొచ్చి ఆ ధరనే అందరి సమ్మతిగా ప్రకటిస్తున్నారు. అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలన్న మన హైకోర్టు తీర్పునుగానీ, బేసిక్ మార్కెట్ ధర ఇవ్వాలని చెప్పే జి.ఓ 1307ను గానీ అమలు చేయకుండా, బుద్ధికి తోచినంత ఇస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి సెజ్ విషయంలో నైతే బేసిక్ మార్కెట్ ధరలో సగం మాత్రమే ఇచ్చారు.

ఇవన్నీ చట్టాలు, చట్టసంబంధమైన నియమాల అతిక్రమణకు సంబంధించిన విషయాలు. ఉద్యమం డిమాండ్లలో ఈ అతిక్రమణకు ప్రాధాన్యం ఇచ్చి దీనిని సవరించేవరకు మా భూముల జోలికి రావద్దని డిమాండ్ చేస్తే ఉద్యమానికి బలం వుంటుంది. ప్రాజెక్టు అసలే వద్దన్న డిమాండును వదులుకోనక్కరలేదు కానీ, దానినే అన్ని సందర్భాలలోను ప్రధానం చేయవలసిన అవసరం చెబుతున్నాము. అయితే ఇవి చట్టపరమైన డిమాండ్లే అయినప్పటికీ కోర్టుకు పొమ్మన్న సలహా మాత్రం ఇవ్వడం లేదు. దానికి కారణం పైన వివరించాను. అభివృద్ధిపథకాలు, భూసేకరణల విషయంలో కోర్టుల జోక్యం పరిమితంగానే వుంటుంది. హైదరాబాద్ చుట్టూ నెలకొన్న అవుటర్ రింగ్‌రోడ్డు మొదలుపెట్టిన రోజులలో హైకోర్టులో అనేక ప్రజాప్రయోజన వ్యాజ్యాలు

దాఖలయ్యాయని, హైకోర్టు జడ్జిలు ప్రభుత్వ వ్యవహార శైలి గురించి కటువుగా వ్యాఖ్యానిస్తూ స్టే ఇచ్చారని పత్రికలలో అందరూ చదివేవుంటారు. ఆ తరువాత స్టేలన్నీ తొలగిపోయాయని మాత్రం పత్రికలు రాయలేదు.

తెలంగాణ విషయంలో మనం మరింత నిర్మాణాత్మకమైన పాత్ర నిర్వర్తించాలని కొందరు మిత్రులు సూచిస్తున్నారు. మనం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఒక ప్రజాతంత్ర ఆకాంక్ష అని మొదటినుండి భావిస్తున్నాము. ఆ ఆకాంక్ష ఇంకా బలమైన రాజకీయ రూపం తీసుకోకముందే మనం ప్రముఖ తెలంగాణ వాదియైన జయశంకర్‌గారి చేత విజయవాడ, విశాఖపట్నం, అనంతపురంలలో మాట్లాడించి తెలంగాణ ఆకాంక్షను ఇతర ప్రాంతాల వారికి వివరించే ప్రయత్నం చేశాం. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులకు నష్టం కల్గించే ప్రభుత్వ విధానాలు, చర్యలకు వ్యతిరేకంగా మన పరిధిలో మనం వుద్యమించాం. పోలవరం ప్రాజెక్టు ఆదివాసుల హక్కులకూ, తెలంగాణ నీటి హక్కులకూ నష్టకరమని వ్యతిరేకించాం. పులిచింతలకు కేటాయించిన నికరజలాలు ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు బదలాయించి నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు ఇవ్వాలని డిమాండ్ చేశాం. సమాన దుర్భిక్ష ప్రాంతాలైన దక్షిణ తెలంగాణ, రాయలసీమల నీటి అవసరాలను సమానంగా చూడకుండా కడప జిల్లా అవసరాలకు పెద్దపీట వేసిన రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిని విమర్శించాం. జి.ఓ 610కి వ్యతిరేకంగా కోస్తా, రాయలసీమలకు చెందిన నాయకులు ఆవేశాలు రెచ్చగొడుతున్న సందర్భాలలో ఆ జి.ఓ పూర్వాపరాలను వివరిస్తూ రాష్ట్ర వ్యాపితంగా కరపత్రాలు పంచి, విజయవాడ, విశాఖపట్నంలో బహిరంగ సభలు నిర్వహించాం. ఉత్తర తెలంగాణ జన జీవితానికి చాలా నష్టం చేస్తున్న ఓపెన్ కాస్ట్ బొగ్గుగనుల ప్రాజెక్టును వ్యతిరేకించాం. మనం తెలంగాణ ఆకాంక్షకు బాసటగా చేపట్టగల కార్యక్రమాలు హక్కుల ఉద్యమం పరిధిలో వుంటాయే తప్ప రాజకీయ కార్యక్రమాలుగా వుండజాలవు. దీనిని దృష్టిలో వుంచుకొని ఇతర విషయాలలో కూడా తెలంగాణ హక్కుల గురించి స్పందిద్దాం.

సచార్‌కమిటీ ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతులపైన ప్రకటించిన రిపోర్టు గురించి పైన ప్రస్తావించాము. ఆ రిపోర్టు ఆధారంగా ముస్లింలు వివక్షను అధిగమించడానికి తోడ్పడగల పాలనావిధానాలను ప్రతిపాదించి వాటి అమలుకోసం ఆందోళన చేయవలసిన అవసరం వుంది. సచార్‌కమిటీ నివేదికను అమలు చేయాలన్న డిమాండ్‌తో అనేక ముస్లింసంస్థలు ఇవాళ పనిచేస్తున్నాయి. నిజానికి ఆ నివేదిక రెకమెండేషన్‌లను ఉన్నదున్నట్లు అమలు చేస్తే వచ్చే ప్రయోజనం తక్కువ. ఆ నివేదికలోని సమాచారం నుండే అంతకంటే బలమైన డిమాండ్లు రూపొందించుకోవచ్చు. ముస్లిం సంస్థలతోను, ఇతర ప్రజాతంత్ర సంస్థలతోను కలసి ఆ ప్రయత్నం చేపట్టవలసి వుంది.

**రాబోయే దినాలలో మన కర్తవ్యాలు:** మొదట్లోనే చెప్పినట్లు, ఇది గడచిన రెండు సంవత్సరాల కార్యక్రమాల సమీక్ష కాదు. 10 సంవత్సరాల సమీక్ష ఈ సం॥ జూన్ 13వ తేదీననే జరుపుకున్నాము కాబట్టి మళ్లీ కార్యక్రమాల సమీక్ష పెట్టుకోకుండా మన కార్యరంగంలో భాగంగా మనం చేస్తున్న పనులను ఐదు రకాలుగా విడగొట్టి ఒక్కొక్క విషయంలో ఏవిధంగా పనిచేస్తున్నామో కొన్ని ఉదాహరణలు తీసుకొని చెప్పడం జరిగింది. కాబట్టి ఫలానా జిల్లాలో చేసిన ఫలానా పని నివేదికలో చోటు చేసుకోలేదని ఎవరూ ఆందోళన చెందనవసరం లేదు.

ఈ సందర్భంగా చెప్పవలసిన ఒక విషయం ఏమిటంటే జిల్లా శాఖల మహాసభలలో జిల్లా ప్రధాన కార్యదర్శులు / కన్వీనర్లు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల గురించి సమగ్రమైన నివేదిక తయారు చేసి

సభ్యులముందు చర్చకు పెట్టాలన్న నియమాన్ని అధిక శాతం జిల్లాలలో పాటించడం లేదు. కర్నూలు జిల్లాలో మాత్రమే దీనిని తప్పనిసరిగా ప్రతీ మహాసభ సందర్భంగాను పాటించడం జరుగుతున్నది. ఈసారి మెదక్‌లోను ప్రధాన కార్యదర్శి నివేదిక ఇవ్వడం జరిగింది. మిగిలిన జిల్లాలలో బాధ్యులు అప్పటికప్పుడు డైరీ తిరగేసి రిపోర్టు చెప్పడం, అదికూడా లేకపోతే తమ జ్ఞాపకాల ఆధారంగా చెప్పడం జరుగుతున్నది. ఈ దురలవాటు నుండి వచ్చే మహాసభల నాటికి అందరూ బయటపడాలి.

రాబోయే దినాలలో చేపట్టవలసిన పనులలో మొదట నిర్మాణాన్ని గురించి కొంత చెప్పుకుందాం. చాలామంది కొత్తసభ్యులు చేరిన విషయం, వారికి అవగాహన, పనిపద్ధతులు నేర్పించవలసిన అవసరం వున్న విషయం మొదట్లోనే చెప్పుకున్నాం. ప్రతి జిల్లాలోను నెలకొకసారి కార్యకర్తలందరూ కలుసుకొని, సమస్యలన్నింటి గురించి చర్చించుకొని, కార్యక్రమాలు చేపట్టే పనివిధానం అవలంబించాలని ఎప్పటినుండో అనుకొంటున్నాము. కొత్త సభ్యులకు పని అలవాటు చేయడానికి ఇది అవసరం. ఈసారి అన్ని జిల్లా సభల సందర్భంగాను నెలలో ఏ రోజు కలుసుకొనేది, ఎక్కడ కలుసుకొనేది నిర్ణయించుకొన్నాం. ఈ నియమాన్ని అన్ని జిల్లాలు తప్పక పాటించాలి. ప్రతినెలా సమావేశం జరిగిన తరువాత రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఫోన్ మీద కానీ, ఉత్తరం ద్వారా కానీ ఆ రోజు తీసుకొన్న నిర్ణయాలు తెలియజేసే పద్ధతి పాటించేటట్లు అయితే ఈ నియమం అమలుకు భరోసా వుంటుంది.

ఇప్పటికీ మనకు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలలో కమిటీలు లేవు. వచ్చే మహాసభల నాటికి వీటిలో మొదటి రెండు జిల్లాలలో కమిటీలు వేయాలన్న టార్గెట్ పెట్టుకోగలమనుకుంటున్నాను. హైదరాబాద్ నగర కమిటీలో ఇప్పుడు కొత్తగా చాలామంది చేరారు. వారిలో కొందరు రంగారెడ్డి జిల్లా వాసులు. అయితే నగరాన్ని అంటిపెట్టుకొని వున్న రంగారెడ్డి జిల్లా ప్రాంతం నుండే కాక, దూరాన వున్న ప్రాంతాల నుండి కూడా కార్యకర్తలు దొరికినపుడే కమిటీ వేద్దాం. ఆ దిశగా హైదరాబాద్ నగర కమిటీ కార్యక్రమాలు చేపట్టాలి. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ నగర అభివృద్ధికి పూర్తిగా బలైంది. దీనినుండి పుట్టిన హక్కుల సమస్యలు అనేకం వున్నాయి. అంతేకాక, సంప్రదాయక కులవివక్ష నుండి పుట్టే అణచివేత కూడా ఇతర తెలంగాణ జిల్లాలకంటే హైదరాబాద్ నగరానికి ఆనుకొనివున్న రంగారెడ్డి జిల్లాలోనే ఎక్కువ. ఇది ఆశ్చర్యం కల్గించవచ్చునుగానీ వాస్తవం. ఈ రెండు విషయాల చుట్టూ అల్లుకొన్న సమస్యలను చేపట్టే క్రమంలో మనకు కార్యకర్తలు దొరుకుతారని ఆశిద్దాం.

మహబూబ్‌నగర్ జిల్లాలో మనం తరచుగా నిజనిర్ధారణ కమిటీలు వేస్తున్నాం. ఏజన్సీలోని చెంచుల స్థితిగతుల నుండి ఎన్‌కౌంటర్ల దాకా అనేక విషయాల మీద నిజనిర్ధారణ చేసి ప్రకటనలు ఇచ్చాం. ఈ సంవత్సరం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకంటే మహబూబ్‌నగర్‌లోనే ఎక్కువ మండలాలు కరువు ప్రాంతంగా ప్రకటించబడ్డాయి కాబట్టి మహబూబ్‌నగర్ మీద కొంచెం ఎక్కువ దృష్టిపెట్టి పనిచేయాల్సి వుంది. హైదరాబాద్, నల్గొండ, కర్నూలు జిల్లా కమిటీలు ఈ బాధ్యత పంచుకోవాల్సి వుంటుంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాలో కార్యకర్తలను పొందగలుగుతామని ఆశిద్దాం.

ప్రకాశం, చిత్తూరుజిల్లా శాఖల సభలు జరగలేదని పైన చెప్పాను. చిత్తూరు జిల్లా శాఖ కొంతకాలంగా స్తబ్దంగా వుంది. నరేంద్రనాథ్ మృతి తరువాత ఆ యింత కూడా పని చేసే పరిస్థితి లేదు. అయితే ఆ జిల్లాలో కార్యకర్తలను పొందడానికి మనం కూడా ప్రత్యేకమైన ప్రయత్నాలు చేయలేదు. ఇకమీదట చేద్దాం. ప్రకాశం జిల్లా శాఖ కూడా తీవ్రమైన పోలీసు నిర్బంధం కారణంగా కొంతకాలం స్తబ్దతలో వుండిపోయి తిరిగి కోలుకోలేదు. అయితే ఆ జిల్లా కన్వీనర్ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నెల తరువాత జిల్లాలో మనకు పరిచయాలున్న వ్యక్తులను కలిసి, మాట్లాడి నిర్మాణాన్ని బాగుచేసుకొనే అవకాశం వుందని అంటున్నాడు. ఈ ప్రయత్నం తప్పనిసరిగా చేపడతాం.

**నివాళి**: ఈ సంవత్సరం మనం ముగ్గురు కార్యకర్తలను కోల్పోయాం. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. నరేంద్రనాథ్ జూలై 5వ తేదీన చనిపోయారు. ఆయన కొంతకాలంగా మెదడు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షుడు యం. సాంబశివరావు జూలై 24వ తేదీన రైలు ప్రమాదంలో చనిపోయారు. నెల్లూరు జిల్లాశాఖ ఉపాధ్యక్షులు మేకల కృష్ణయ్య ఆగష్టు 17వ తేదీన రోడ్డుప్రమాదంలో చనిపోయారు.

నరేంద్రనాథ్‌ది అసాధారణమైన వ్యక్తిత్వం. పేదలు, బలహీన వర్గాలకు చెందిన వారు అనుభవించే అణచివేత నుండి పారిశ్రామిక నాగరికత తీరుతెన్నుల దాకా అన్నిరకాల సామాజిక జీవిత సమస్యలతో ఆయన అనునిత్యం తలపడుతుండేవాడు. ఏ అన్యాయంతోను ఏ రోజూ రాజీ పడకపోయినా మిత్రులే తప్ప శత్రువులు లేని మనిషిగా బతకగలిగాడు. ఆదర్శాలపట్ల నిబద్ధతకు మారుపేరుగా నిలిచాడు.

సాంబశివరావు, మేకల క్రిష్ణయ్యలు బీద, వెనుకబడిన వర్గాల కుటుంబాలలో పుట్టి తమ జీవితానుభవం నుండే న్యాయాన్యాయ విచక్షణ నేర్చుకొన్నారు. అభ్యుదయ రాజకీయాల వైపు, హక్కుల కార్యరంగం వైపు ఆకర్షితులై ప్రజలకోసం శాయశక్తులా కృషిచేశారు. వారి మృతి వల్ల ఆధారం కోల్పోయిన వారి కుటుంబాలు మన నుండి ఏ రూపంలో ఆసరా కోరుకుంటారో తెలుసుకొని మనం చేయగల సహాయం చేద్దాం.

రాబోయే రోజులలో చేపట్టవలసిన కార్యక్రమాల గురించి పైన చెప్పుకొన్నాం. పునశ్చరణ చేయకుండా మరొక రెండు రంగాలలో చేయవలసిన కృషి గురించి ఇప్పుడు చెప్పుకొని ముగిద్దాం.

ఈ సంవత్సరం రాష్ట్రంలో కరువు మొదట భయపడినంత ఘోరంగా లేకపోయినా తీవ్రంగానే వుంది. మూడు ప్రాంతాలలోకి తెలంగాణ జిల్లాలలో ఎక్కువగా వుంది. డిసెంబర్ – జనవరి నెలలతో మొదలుపెట్టి దాని ప్రభావం గ్రామీణ ప్రాంతాలలో అనుభవంలోకి వస్తుంది. తాగునీరు, చేసుకోవడానికి పని, పశుగ్రాసం, వర్షాలు ఆలస్యంగా కురిసాయి కాబట్టి సాగుకు అనుకూలమైన విత్తనాల సరఫరా, పాతబాకీలు పక్కన పెట్టి కొత్తరుణాల మంజూరు, వానలు అసలే లేనిచోట తెల్లకార్డుమీద అప్పుగా ధాన్యం సరఫరా, లేకపోతే అన్నం పెట్టే గంజికేంద్రాలు మొదలైనవి ప్రజల అవసరాలు. వీటిలో ఉపాధి హామీ పథకం కల్పించే పాక్షికమైన పని హక్కు తప్ప వేరే ఏదీ ఇవాళ ఒక హక్కు కాదు. ఆ ఒక్క హక్కు కూడా సక్రమంగా అమలు కావడం లేదు. తరచుగా కరువులు వచ్చే ఈ దేశంలో కరువు కాలపు హక్కులు లేకపోవడం ఏమిటన్న ప్రశ్న లేవదీస్తూ, ఈ వివిధ అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి పెట్టవలసిన అవసరం వుంది.

రెండవది మధ్యభారత ఆదివాసీ ప్రాంతంలో కేంద్ర బలగాలను దించి మావోయిస్టులను ఏరివేయడం అనే పేరుమీద అమలుచేస్తున్న దమనకాండ. మొన్నటి 11వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో జరిగిన 'ఎన్‌కౌంటర్'తో ఇది మొదలయ్యిందని భావించవచ్చు. మావోయిస్టుల రాజకీయ సవాలును ఎదుర్కొనడం ఈ అణచివేతకు ఒక ప్రేరణ కాగా, ఆ ప్రాంతంలోని ఖనిజ వనరులను పారిశ్రామిక ముడిసరుకుగా పెద్దఎత్తున వినియోగించాలన్న ఆరాటం రెండవ ప్రేరణ. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు కార్పొరేట్ సంస్థలతో పెట్టుబడి మదుపు గురించి భారీగా ఒప్పందాలు చేసుకొని తయారుగా వున్నాయి. ఇవతల మావోయిస్టులు కూడా ప్రభుత్వ సవాలుకు ఎదురు సవాలు విసురుతూ యుద్ధానికి తయారుగా వున్నామని అంటున్నారు.

ఆ ప్రాంతంలో అధిక సంఖ్యలో నివసించే ఆదివాసుల ప్రాణాలకు, జీవనానికి ఈ సంఘర్షణ చాలా హాని చేయగలదు. కేంద్ర ప్రభుత్వం పారా మిలటరీ బలగాలను వెనక్కు తీసుకోవాలని, మావోయిస్టులు కూడా సంయమనం పాటించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయాల్సిన అవసరం వుంది. ఈ దృష్టితో ఢిల్లీకి చెందిన కొందరు ప్రజాతంత్రవాదులు ఆగస్టు నెలలో ఒక సమావేశం నిర్వహించి మనల్ని కూడా దానికి ఆహ్వానించారు. ఆ సమావేశంలో సిటిజన్స్ కమిటీ ఫర్ పీస్ అనే వేదిక ఏర్పాటయ్యింది. ప్రొ॥ మనోరంజన్ మహంతి, ప్రొ॥ అమిత్‌భాదురి, ప్రొ॥ నందినిసుందర్, హిమన్షుకుమార్, దేవేన్ బందోపాధ్యాయ తదితరులు ఇందులో ప్రధాన పాత్రధారులు. మనం కూడా దానిలో భాగస్వాములం. ఈ వేదిక తీసుకొనే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మీకందరికి తెలియజేయడం జరుగుతుంది. అయితే మనం ఆ వేదిక పిలుపుకోసం ఆగకుండా ఈ దమనకాండకు వ్యతిరేకంగా వెంటనే ప్రచారం చేపట్టడం అవసరం.

దంతెవాడ జిల్లాలో ఘర్షణలు, అణచివేత పెరిగినప్పుడల్లా బాధిత ఆదివాసులు మన ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వస్తుండడం తెలిసిన విషయమే. పోలీసుల నిఘా కూడా ఇక్కడ పెరుగుతుంది. ప్రస్తుతం అక్కడ మొదలైన పారామిలటరీ చర్యలకు తోడుగా ఖమ్మం జిల్లా భద్రాచలం ఏజెన్సీలో కూడా పోలీసులు స్థానిక ప్రజలను నిర్బంధించడం, హింసించడం జరుగుతున్నది. చర్ల పోలీసుల చేత చిత్రహింసలకు గురైన కొమురం నరసింహరావు అనే ఆదివాసి సెప్టెంబర్ 7వ తేదీన తన స్వగ్రామమైన ఆర్. కొత్తగూడెం సమీపంలో ఆత్మహత్య చేసుకొన్నాడు. మన ఖమ్మం జిల్లా కమిటీ ఈ అణచివేత విషయంలో ఇప్పటికే స్పందించింది. ఈ నెలలోనే రాష్ట్ర బాధ్యులు భద్రాచలంలో పర్యటించి ఈ అణచివేతను ఎండగట్టడానికి ఒక కార్యక్రమం రూపొందించుకుంటే బాగుంటుంది. వీలు చూసుకొని మధ్య భారత రాష్ట్రాల పర్యటన కూడా పెట్టుకుందాం.

ఈ విషయంలో దేశంలోను, రాష్ట్రంలోను వున్న ఇతర హక్కుల సంఘాలు మనతో పూర్తిగా ఏకీభవించకపోవచ్చునని తెలపడం అవసరం. సిటిజెన్స్ కమిటీ ఫర్ పీస్ (శాంతికోసం పౌరుల వేదిక) అనడంలోనే ఇరుపక్షాలకూ సంఘర్షణ ఆపమన్న డిమాండ్ లేక విజ్ఞప్తి వుంది. ప్రభుత్వ దమనకాండనే ఈ కమిటీ ప్రధానంగా ప్రస్తావించినప్పటికీ, మావోయిస్టులు సైతం వారి చర్యల ద్వారా సంఘర్షణాత్మక వాతావరణాన్ని పెంచుతున్నారన్న వ్యాఖ్య వుంది. ఇతర హక్కుల సంఘాలు కేవలం ప్రభుత్వం పారామిలటరీని వెనక్కు తీసుకోవాలన్న డిమాండుకే పరిమితం కావాలని భావిస్తున్నాయి. హక్కుల సంఘాల ఉమ్మడి వేదికగా వ్యవహరిస్తున్న సి.డి.ఆర్.ఓ (కో–ఆర్డినేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రైట్స్ ఆర్గనైజేషన్స్) ఈ మేరకు ప్రకటన జారీచేసింది.

**ముగింపు:**

పది సంవత్సరాల సమీక్షా సమావేశంలో ప్రవేశపెట్టిన నివేదికలోని చివరి వాక్యాలను ఇక్కడ గుర్తుచేసుకోవడం ఉచితంగా వుంటుంది.

సంస్థ నిర్మాణ సూత్రాలు, నియమాలు ఎన్ని వ్రాసుకొన్నా చివరకు సంస్థ పటిష్టత, ఉద్యమ పురోగమనం మన చొరవ మీద ఆధారపడి వుంటాయి. మన అజెండా మీద విశ్వాసంతో, మనం సమాజ పురోగతికి అవసరమైన పాత్ర నిర్వర్తిస్తున్నామన్న నమ్మకంతో, ప్రజలకు మన అవసరం వుందన్న గుర్తింపుతో సమస్యలకు స్పందిద్దాం. మనం కదిలి, పదిమందిని కదిలించి, సంస్థనూ ఉద్యమాన్నీ ముందుకు తీసుకుపోదాం. మనందరికి తప్పనిసరైన వృత్తిపరమైన బాధ్యతలు, కుటుంబ బాధ్యతలు వున్నాయి. మనమెవరమూ పూర్తికాలం కార్యకర్తలము కాము. అయితే మనకు అందుబాటులో వున్న సమయాన్ని ఎంత మేరకు, ఎంత ఫలవంతంగా మానవ హక్కుల ఉద్యమ పురోగమనం కోసం వెచ్చిస్తున్నాం అని ఎవరికి వారు ప్రశ్నించుకొని ముందుకు పోదాం.

ఒక రాజకీయ సిద్ధాంతంపట్ల నిబద్ధత గానీ, ఒక రాజకీయ ఉద్యమం అవసరాలు గానీ, ఒక సామాజిక వర్గం ప్రయోజనాలు కానీ కాక, కొన్ని విలువల పట్ల నిబద్ధతతో మనమందరం ఒక దగ్గరకు వచ్చాం. ఆ విలువల వెలుగులో సమాజాన్ని, మానవజీవితాన్ని అర్థం చేసుకుంటూ దానిని ప్రజాస్వామీకరించడానికి, మానవీకరించడానికి అవసరమైన కార్యరంగాన్ని నిర్దేశించుకొని కార్యక్రమాలు చేపడుతున్నాం. మనం చేపట్టే కార్యక్రమాలు అన్ని అణగారిన వర్గాల ఆరాటాలకూ ఆసరా ఇస్తాయిగానీ మనకు ప్రమాణం ఆ ఆరాటంలో వ్యక్తమయ్యే విలువలు. ఇది మన రాష్ట్రంలోని ప్రజా ఉద్యమాల చరిత్రలో ఒక కొత్త ప్రయోగం. దీనిని నిలబెట్టలేకపోతే మన ప్రయత్నానికే కాక, విలువలు మనుషుల్ని ఒక దగ్గరకు తీసుకురాగలవన్న ప్రజాతంత్ర విశ్వాసానికి కూడా నష్టం చేసిన వారమౌతాం. నిలబెట్టడమే కాక విజయవంతంగా ముందుకు తీసుకు పోయినట్టయితే ప్రజాస్వామ్యభావనకు బలం చేకూర్చిన వాళ్లమౌతాం.

మనం ఈరోజు నరేంద్రనాథ్ ప్రాంగణంలో ఈ సభలు జరుపుకొంటున్నాం. ప్రజలకు సమస్యలున్నంత కాలం తాను విశ్రమించకూడదని నమ్మిన ఉద్యమకారుడు నరేంద్రనాథ్. తన కృషికి ఆశించిన ఫలితం రాకపోయినా నిరాశచెందలేదు. ఎదుటివారిని నిరాశపరచలేదు. నిరాశాజనకమైన పరిస్థితులలో మరింత ఎక్కువ పనిచేయాల్సిన అవసరం వుందని భావించాడే తప్ప పరిస్థితి పేరుచెప్పి విరామం తీసుకోవాలనుకోలేదు. మనం నరేంద్రనాథ్ నుండి ఆ స్ఫూర్తి పొందుదాం. కొత్తగా ఉద్యమంలోకి వస్తున్నవారికి ఆ స్ఫూర్తిని అందిద్దాం.

3 అక్టోబర్, 2009 **కె. బాలగోపాల్**
అనంతపురం. రాష్ట్రప్రధాన కార్యదర్శి